



ఎస్.రాయవరం మండలం పెద గుమ్ములూరులో వృద్ధురాలికి పింఛన్ నగదు అందజేస్తున్న హోం మంత్రి వంగలపూడి అనిత



పరవాడ మండలం తానాం గ్రామంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు

అంతటా పింఛన్ పండగ

జిల్లా వ్యాప్తంగా ఉదయం 6 గంటల నుంచే పంపిణీ

తొలి రోజు 83.52 శాతం మందికి అందజేత

- ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి 1,000 చొప్పున కలిపి ఒక్కొక్కరికి రూ.7,000లు
- అవ్వా తాతల మోములో ఆనందం
- ఎస్.రాయవరం మండలంలో హోం మంత్రి అనిత, నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు హాజరు
- ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చిందని లబ్ధిదారుల సంబరం
- పలు చోట్ల సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

జిల్లా వ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం సోమవారం పండగలా జరిగింది. అన్ని నియోజకవర్గాల పరిధిలోని మండలాలు, గ్రామాల్లో ఉదయం 6 గంటల నుంచే ఈ వేడుక ప్రారంభమైంది. ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి 1,000 చొప్పున కలిపి ఒక్కొక్కరికి రూ.7,000 అందజేయడంతో అవ్వా తాతల మోములో ఆనందం వెల్లివిరిసింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చిందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. పలు చోట్ల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకాలు చేశారు.

జిల్లాలో ఎస్.రాయవరం మండలం పెదగుమ్ములూరులో నిర్వహించిన కార్యక్రమంలో హోం మంత్రి వంగలపూడి అనిత పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ గవరపాలెం బోయిగూడెంలో పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు మండలంలోని రేవాళ్ల గ్రామంలో, ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పురపాలక పరిధిలోని పోతిరెడ్డిపల్లిలో పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పరవాడలో, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి కె.కోటపాడు మండలం గొట్లాం గ్రామంలో ఏర్పాటు చేసిన పింఛన్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు పలువురు లబ్ధిదారులకు స్వయంగా పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలు కోలాహలంగా జరిగాయి. కూటమి ... మిగతా 8వ పేజీలో



పింఛన్ నగదు పెంచి భరోసా కల్పించారు

ఒకేసారి రూ.7 వేలు పింఛను అందుకోవడంతో పట్టరాని ఆనందంగా ఉంది. నెలంతా మందులు, ఇతర ఖర్చులకు సరిపోతాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం రూ.వెయ్యి పెంచి మూడు నెలలు కలిపి రూ.7,000 పింఛను ఇచ్చారు. ఎవరి మీదా ఆధార పడే పరిస్థితి లేకుండా భరోసా కల్పించారు.

- లెక్కల మాణిక్యం, అయ్యన్న కాలనీ, నర్సీపట్నం

వచ్చిన డబ్బుతో బోధకాలుకు చికిత్స చేయించుకుంటా..



బోధకాలు వ్యాధితో బాధపడుతున్న నాకు రాష్ట్ర ప్రభుత్వం రూ.పది వేలు పింఛన్ ఇవ్వడం చాలా ఆనందంగా ఉంది. గత ప్రభుత్వం కేవలం రూ. ఐదు వేలు ఇచ్చింది. అయితే కూటమి అధికారంలోకి వస్తే మాలాంటి వారికి పింఛన్ పెంచుతామని చెప్పడమే కాకుండా అమలు చేయడం సంతోషంగా ఉంది. ప్రభుత్వం ఇచ్చిన పింఛన్ డబ్బులతో నా బోధకాలు వ్యాధిని బాగు చేయించుకుంటా. పింఛన్ అందించిన ప్రభుత్వానికి ధన్యవాదాలు.

- మైపాలి లక్ష్మి, బోయిగూడెం, అనకాపల్లి

సీఎం చంద్రబాబుకు రుణపడి ఉంటా..



నా భర్త చనిపోవడంతో పిల్లలు లేని కారణంగా ఒంటరిగా అద్దె ఇంట్లో ఉంటున్నాను. వృద్ధాప్యంలో ఉన్న నాకు పింఛనే ఆధారం. కూటమి ప్రభుత్వం పింఛను నగదు పెంచి ఇవ్వడంతో నాకు ఎంతో మేలు జరుగుతుంది. సీఎం చంద్రబాబుకి రుణపడి ఉంటాను.

- చల్లా సావిత్రి, వీవర్స్ కాలనీ, పాయకరావుపేట

మా జీవితాల్లో వెలుగులు నింపారు



రూ.15 వేలు పెన్షన్ అందుకోవడం చాలా ఆనందంగా ఉంది. నెల వారీ నిత్యావసర సరకులకు సరిపోతాయి. తీవ్ర అనారోగ్యంతో లేవలేని స్థితిలో వీల్ చైర్ మీద ఉన్న వారికి చంద్రబాబు రూ.15 వేలు ఇచ్చి మా జీవితాల్లో వెలుగులు నింపారు. దివ్యాంగులకు ఇచ్చే రూ.3వేలు పెన్షన్ ఆరు వేలు చేశారు. చంద్రబాబుకి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

- మడ్డు నరేశ్, దివ్యాంగుడు, నర్సీపట్నం

మాటలు రాలేదు...చంద్రబాబు చల్లగా ఉండాలి



ఒకేసారి రూ.7 వేలు పెన్షన్ తీసుకోవడంతో మాటలు రాలేదు. నేను టైలరింగ్ వృత్తిపై ఆధారపడి జీవించేవాడిని. ప్రస్తుతం ఆరోగ్యం సహకరించడం లేదు. దీంతో టైలరింగ్ కూడా చేయలేకపోతున్నా. ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన తొలి నెలలోనే సీఎం చంద్రబాబునాయుడు పెంచిన పింఛన్ ఇచ్చారు. చంద్రబాబు చల్లగా ఉండాలి.

- జె.నాగభూషణం, ఉపమాక, నక్కపల్లి మండలం



కలెక్టర్ పరిశీలన

బొండావానిపాలెంలో పింఛన్ల పంపిణీని పరిశీలిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

సబ్బవరం, జూలై 1: మండలంలోని గొటివాడ శివారు బొండావానిపాలెం గ్రామంలో జరుగుతున్న పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి సోమవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మహేశ్, డీటీ వెంకట్, వెలుగు ఏపీఎం సాయిరమేశ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వితంతువుకు హోం మంత్రి భరోసా

ఎస్.రాయవరం: రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత సేవాభావాన్ని చాటుకున్నారు. మండలంలోని పెదగుమ్ములూరు గ్రామంలో సోమవారం నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆమెను మామిడి సత్యవతి అనే వితంతువు కలిసి తమ గోడు వినిపించారు. తన భర్త చనిపోయి రెండేళ్లు అయ్యిందని, పెన్షన్ కోసం మూడు సార్లు దరఖాస్తు చేసుకున్నా మంజూరు చేయలేదని ఆవేదన వ్యక్తం చేసింది. ఆమెకు హోం మంత్రి అనిత ధైర్యం చెప్పి తన సొంత నిధుల నుంచి రూ.ఏడు వేల నగదును సహాయంగా అందజేశారు. కొత్త పింఛన్ మంజూరయ్యే వరకు తానే పింఛన్ ఇస్తానని హామీ ఇవ్వడంతో సత్యవతి ఆనందం వ్యక్తం చేసింది.



పింఛన్ లబ్ధిదారుల ఆనందోత్సాహం

ఉద్యోగులకు జీతాలు వచ్చేశాయ్

- కూటమి ప్రభుత్వం వచ్చిన తొలి నెలలో ఒకటో తేదీన వేతనాలు
- జిల్లాలో ఉద్యోగ వర్గాల్లో హర్షాతిరేకాలు

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాల చెల్లింపులు మొదలయ్యాయి. సోమవారం ఉదయం 10 గంటల నుంచే ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు పడినట్టు మొబైల్స్‌కు మెసేజ్‌లు రావడంతో ఉద్యోగ వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు సకాలంలో అందేవి కావు. అత్యవసర సేవలు అందించే పోలీసు, రెవెన్యూ, వైద్య, ఆరోగ్యశాఖలకు మినహా మిలిగిన అన్ని ప్రభుత్వ శాఖలకు నెలలో ఏ తారీఖున జీతాలు పడతాయో తెలియని పరిస్థితులు ఉండేవి. గత మూడేళ్లగా జీతాలు ఎప్పుడు వస్తాయా? అని ఎదురుచూడాల్సి వచ్చేది. ఎన్నికలకు ఆరు నెలల ముందు మాత్రమే కొంత వరకు సకాలంలో జీతాలు చెల్లించింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉద్యోగులకు శుభవార్త చెప్పింది. ఇక ముందు ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లిస్తామని చెప్పింది. ఇచ్చిన హామీ మేరకు ఒకటో తేదీన జీతాలు అందుతుండడంతో ఉద్యోగ వర్గాల్లో ఆనందం వ్యక్తమవుతోంది. జిల్లాలో 42కుపైగా వివిధ రాష్ట్ర ప్రభుత్వ శాఖలు ఉన్నాయి. ఆయా ప్రభుత్వ శాఖల ద్వారా అన్ని కేటగిరీలకు చెందిన సుమారు 14 వేలకు పైచిలుకు ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరందరికీ గత ఐదేళ్లలో ఏనాడూ ఒకటో తేదీన జీతాలు అందిన దాఖలాలు లేవు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొలి నెల జూలై ఒకటో తేదీ సోమవారం సాయంత్రానికి జిల్లాలో దాదాపు 9 వేల మందికిపైగా ఉద్యోగులకు జీతాలు వారి బ్యాంకు ఖాతాల్లో జమ అయినట్టు ఉద్యోగ వర్గాలు చెబుతున్నాయి. విద్యాశాఖలో ఉద్యోగులకు ఒకటి, రెండు రోజుల్లో జీతాలు జమ కానున్నాయి. ఒకటో తేదీ ఉదయం నుంచి జీతాలు పడుతున్నట్టు మొబైల్ ఫోన్‌లకు మెసేజ్‌లు వస్తుండడంతో ఉద్యోగ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. కూటమి ప్రభుత్వం మార్పు ప్రభావం కనిపిస్తున్నదని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

హైడ్రో పవర్ ప్రాజెక్టు కోసం సర్వే వద్దు -7లో

టిడ్కో ఇళ్లల్లో ఉండలేం..


తాగునీరు, రహదారి, ప్రహరీ గోడ లేక ఇక్కట్లు

అస్తవ్యస్త డ్రైనేజీ వ్యవస్థతో అవస్థలు

- 8 బోర్లు తవ్వి నాలుగు మోటార్లు మాత్రమే ఏర్పాటు
- అవి కూడా తరచూ మొరాయింపు
- ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని హడావిడిగా ప్రారంభించిన గత వైసీపీ ప్రభుత్వం
- 432 మందికి ఫ్లాట్ల కేటాయింపు
- ప్రస్తుతం 150 మంది మాత్రమే నివాసం
- కనీస సౌకర్యాలు లేక లబ్ధిదారులు గగ్గోలు
- కూటమి ప్రభుత్వం రాకతో కష్టాలు తీరతాయని ఆశాభావం



టిడ్కో గృహ సముదాయం



అధ్వానంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థ

ఎలమంచిలి, జూలై 1: ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని గత వైసీపీ ప్రభుత్వం హడావిడిగా ప్రారంభించిన టిడ్కో గృహ సముదాయంలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. రహదారులు, తాగునీటి వసతి, గృహ సముదాయం నిర్వహణ లేకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాగునీటికి కిలో మీటరు దూరంలో ఉన్న ఆర్వో ప్లాంట్ వద్ద వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు.

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో స్థానిక రామ్‌నగర్ సమీపంలో జాతీయ రహదారి పక్కన 11 బ్లాకులతో టిడ్కో గృహ సముదాయం నిర్మాణం చేపట్టింది. నిరుపేదలను గుర్తించి వారిని లబ్ధిదారులుగా ఎంపిక చేసింది. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చాక జాబితాలో మార్పులు చేసింది. అనుయాయులకు అందులో చోటు కల్పించింది. నిర్మాణంలో ఉన్న 11 బ్లాకులకు గాను 9 బ్లాకులను మాత్రమే పూర్తి చేసింది. ఎన్నికలు సమీపిస్తుండడంతో గత ఏడాది జూలై నెలలో హడావిడిగా గృహ సముదాయాన్ని ప్రారంభించి 432 మందికి ఫ్లాట్లను కేటాయించింది.

సౌకర్యాలు లేక సతమతం

కనీస వసతులు కల్పించకుండా గృహ సముదాయాన్ని ప్రారంభించడంతో 432 మందికి గాను ప్రస్తుతం 150 మంది లబ్ధిదారులు మాత్రమే ఆ ఇళ్లల్లో నివాసముంటున్నారు. అయితే తాగునీటి సదుపాయం లేకపోవడంతో కిలో మీటరు దూరంలో ఉన్న ఆర్వో ప్లాంట్ల వద్దకు వెళ్లి నీరు తెచ్చుకుంటున్నారు. రహదారి సౌకర్యం లేకపోవడంతో స్థానికుల సహకారంతో టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు సొంతంగా మట్టి రోడ్డు వేసుకున్నారు. ఇక ఈ గృహ సముదాయాల కోసం 8 బోర్లు వేయగా, కేవలం నాలుగు బోర్లకు మాత్రమే మోటార్లు బిగించారు. అయితే ఆ నాలుగు మోటార్లు కూడా పూర్తి స్థాయిలో పని చేయడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. ఈ మోటార్ల ద్వారా సుద్ద నీరు వస్తుండడంతో వాడుకకు మాత్రమే ఉపయోగపడుతున్నాయి. మోటార్ల నిర్వహణకు సిబ్బందిని నియమించకపోవడంతో లబ్ధిదారులే ఆ బాధ్యతలు చూసుకుంటున్నారు. ఇక డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో మురుగునీరు రోడ్లపైకి వచ్చేస్తోంది. గృహ సముదాయానికి ప్రహరీ గోడ లేకపోవడంతో చుట్టు పక్కల ఉన్న పొలాల నుంచి విష కీటకాలు ఇళ్లల్లోకి వచ్చేస్తున్నాయని లబ్ధిదారులు గగ్గోలు పెడుతున్నారు. నాణ్యతా లోపంతో శ్లాబ్‌ల నుంచి వర్షపు నీరు ఇళ్లల్లోకి కారిపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ స్విచ్ బోర్డులు కూడా సక్రమంగా పని చేయడం లేదని, టిడ్కో నిర్వహణ అధికారుల దృష్టికి తీసుకువెళితే కొన్ని రోజుల తరువాత సిబ్బంది వచ్చి నామమాత్రంగా పని చేసి వెళ్లిపోతున్నారని, మళ్లీ అదే సమస్య వస్తోందని చెబుతున్నారు. టిడ్కో అధికారులతో సమన్వయం లేకపోవడంతో మునిసిపల్ అధికారులు ... మిగతా 8వ పేజీలో

విమానాశ్రయంలో డీజీ యాత్ర

- అందుబాటులోకి వచ్చిన కొత్త సౌకర్యం
- ఇకపై క్షణాల్లో చెక్ ఇన్



ఎయిర్‌పోర్ట్‌లో అమలవుతున్న ఎఫ్ఆర్‌టీ విధానం

విశాఖపట్నం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం విమానాశ్రయంలో ప్రయాణికులకు 'డిజి' యాత్ర అనే కొత్త సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. చెకింగ్ పాయింట్ల వద్ద సమయం వృథా కాకుండా అతి తక్కువ సమయంలో ప్రాసెస్ పూర్తి కావడానికి ఇది దోహదపడుతుంది. ఇది ఒక అప్లికేషన్ (యాప్). ప్రయాణికులు ఒకసారి డౌన్‌లోడ్ చేసుకుంటే సరిపోతుంది. ఆ యాప్‌లో ఆధార్, ఇతర వివరాలు నమోదుచేయాలి. సాధారణంగా విమానాశ్రయంలోకి ప్రవేశించే ముందే సెక్యూరిటీ వద్ద ఆధార్, బోర్డింగ్ పాస్ అన్నీ చూపించాలని సిబ్బంది కోరతారు. వాటిని చూశాకే లోపలకు అనుమతి ఇస్తారు. ఆ తరువాత ఏ విమానం ఎక్కాలో ఆ కౌంటర్ ముందు క్యూలో నిల్చోవాలి. అక్కడ మళ్లీ బోర్డింగ్ పాస్, ఆధార్, లగేజీ అన్నీ ఇవ్వాలి. ఆ తరువాత అక్కడి నుంచి చెక్ ఇన్ కౌంటర్ వద్ద వస్తువులన్నీ అప్పగించాలి. అక్కడ క్లియరెన్స్ అయ్యాక అప్పుడు సంబంధిత సిటింగ్ లాంజ్‌లోకి అనుమతిస్తారు. విమానం వచ్చాక ఆ గేటు ద్వారా మళ్లీ బోర్డింగ్ పాస్ తనిఖీ చేసి పంపిస్తారు. ప్రతిచోటా అన్ని కార్డులు చూపించాలి. డిజి యాత్రలో అవన్నీ అవసరం ఉండవు. యాప్‌లో పూర్తి వివరాలు ఉంటాయి కాబట్టి... డిజి యాత్ర మిషన్ ముందు నిల్చోగానే అది ముఖాన్ని ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీ (ఎఫ్ఆర్‌టీ) ద్వారా గుర్తించి ఓకే చేస్తుంది. మ్యాచ్ కాకపోతే రిజెక్ట్ చేస్తుంది. ఇదంతా క్షణాల్లో జరిగిపోతుంది. ఆధార్ కార్డు చూపించాల్సిన అవసరమే ఉండదు. అక్కడ వచ్చే స్లిప్ తీసుకొని మిగతా ప్రాసెస్ అంతా టకటకా పూర్తి చేసుకుంటూ పోవచ్చు. పెద్దగా వేచి ఉండాల్సిన అవసరం ఉండదు. ఈ సదుపాయం ప్రస్తుతం దేశంలోని 14 విమానాశ్రయాల్లో అమలు చేస్తున్నారు. అందులో విశాఖపట్నం కూడా ఒకటి. ప్రస్తుతం ట్రయల్ రన్‌లో ఉంది. నాలుగు కౌంటర్లు ఏర్పాటుచేశారు. డిమాండ్‌ను బట్టి మరిన్ని పెడతారు. ప్రయాణికులు రాగానే యాప్ డౌన్‌లోడ్ చేయించి, వివరాలన్నీ నమోదు చేయిస్తున్నారు. ఇందులో ప్రతిచోట ఐడీ కార్డులు చూపించాల్సిన అవసరం ఉండదు. అదే సౌలభ్యం.

ప్రజలకు సేవ చేయలేమనుకుంటే వెళ్లిపోవచ్చు

- పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి సకాలంలో హాజరుకాని ఎంపీడీవో, తహసీల్దార్‌లపై హోం మంత్రి వి.అనిత ఆగ్రహం
- వారిద్దరిపై చర్యలు తీసుకోవలసిందిగా కలెక్టర్‌కు ఫోన్



ఎంపీడీవోపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న హోం మంత్రి అనిత

ఎస్.రాయవరం, జూలై 1: పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి సకాలంలో హాజరుకాని తహసీల్దార్, ఎంపీడీవోలపై చర్యలు తీసుకోవలసిందిగా జిల్లా కలెక్టర్‌ను హోం మంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు. సోమవారం ఆమె తన సొంత నియోజక వర్గమైన అనకాపల్లి జిల్లా పాయకరావుపేట నియోజకవర్గ పరిధిలోని ఎస్.రాయవరం మండలం పెదగుమ్ములూరు గ్రామంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. తాను వెళ్లే సమయానికి ఎంపీడీవో సత్యనారాయణమూర్తి, తహసీల్దార్ జయలక్ష్మి హాజరుకాకపోవడంపై మంత్రి తీవ్ర అసహనం వ్యక్తంచేశారు. కొద్దిసేపటికి సమావేశం వద్దకు చేరుకున్న ఎంపీడీవోపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. అప్పటికి కూడా తహసీల్దార్ రాకపోవడంపై మండిపడ్డారు. వెంటనే జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టికి ఫోన్ చేసి ఇరువురి అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీచేశారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని నిర్వహిస్తున్న పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి హోం మంత్రి హాజరైనా స్థానిక తహసీల్దార్ గానీ ఎంపీడీవో గానీ రాలేదంటే తమ చేతకానితనమా లేక అధికారుల నిర్లక్ష్యమా అర్థం కావడం లేదంటూ మండిపడ్డారు. వైసీపీ మైకం నుంచి బయటకు రావడానికి కొంతమంది అధికారులకు కష్టంగా ఉన్నట్టుందన్నారు. వారిని బయటకు ... మిగతా 8వ పేజీలో

క్రైం... crime news

ట్రాక్టర్ ఢీకొని ఒకరి మృతి



మృతుడు గొర్లి గురయ్య (ఫైల్)

సబ్బవరం, జూలై 1 : మండలంలోని గొల్లలపాలెం శివారు అమరపినివానిపాలెం సమీపంలో ఆదివారం రాత్రి ట్రాక్టర్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఇందుకు సంబంధించి బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలివి. గొల్లలపాలెం గ్రామానికి చెందిన నేబర్తి పైడిరాజుకు ఆ గ్రామ శివారు అమరిపినివానిపాలెంలో మామిడి తోట ఉంది. వెదుళ్లనరవకు చెందిన ఎస్కే హలీమ్ లీజుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. సదరు మామిడి తోట పనులు చేసేందుకు విజయనగరం జిల్లా ఎస్.కోట బర్మా కాలనీకి చెందిన గొర్లి గురయ్య(45), అతని భార్య లక్ష్మిని రెండేళ్ల క్రితం నియమించాడు. భార్యతో కలిసి గురయ్య మామిడి తోటలనే నివాసం ఉంటున్నాడు. ఆదివారం రాత్రి తోట చదును చేసే పనిలో భాగంగా ట్రాక్టర్‌తో మట్టిని తరలిస్తుండగా ప్రమాదవశాత్తు ఢీకొని గురయ్య మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు సీఐ పిన్నింటి రమణ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. వీరికి ఇంటర్ చదువుతున్న కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుటుంబం పెద్ద దిక్కును కోల్పోవడంతో వారంతా కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

150 కిలోల గంజాయితో ఐదుగురి అరెస్టు



పట్టుబడిన గంజాయి సొత్తు, నిందితులతో సీఐ రమేశ్ సిబ్బంది

పెదబయలు, జూలై 1: ఒడిశా నుంచి అక్రమంగా తరలిస్తున్న 150 కిలోల గంజాయితో ఐదుగురి నిందితులను అరెస్టు చేసినట్టు ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపారు. ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ముందస్తు సమాచారంతో సోమవారం సీతగుంట కూడలిలో వాహనాలు తనిఖీ చేస్తుండగా రెండు ద్విచక్ర వాహనాలపై ఇద్దరి చొప్పున నలుగురు, కారులో ఉన్న మరొకరిని పట్టుకున్నట్టు చెప్పారు. వీరి విచారించగా ఒడిశా నుంచి గంజాయిని కొనుగోలు చేసి రూఢకోట మీదుగా కుజబంగి, సీతగుంట తరలిస్తున్నట్టు చెప్పారన్నారు. పట్టుబడిన వారిలో ముంచంగిపుట్టు మండలం కరిముక్కిపుట్టు పంచాయతీకి బలడ గ్రామానికి చెందిన వి.సురేశ్, పెద్దగూడ గ్రామానికి చెందిన కె.లోకేశ్, అరకు మండలం పద్మాపురం గ్రామానికి చెందిన జి.శివప్రసాద్, ఒడిశా రాష్ట్రానికి చెందిన అర్జున్,ఖిల్లాగుత్నోగా గుర్తించనట్టు ఎస్ఐ మనోజ్‌కుమార్ చెప్పారు. గంజాయిని స్వాధీనం చేసుకున్నామని, కారు, రెండు ద్విచక్ర వాహనాలను సీజ్ చేసి నిందితులను రిమాండ్‌కు తరలించామని ఆయన చెప్పారు.

జీపు బోల్తా : పలువురికి గాయాలు

ముంచంగిపుట్టు, జూలై 1: మండలంలోని బంగారుమెట్ట సమీపంలో సోమవారం జీపు బోల్తా పడి పలువురు గాయపడ్డారు. పెదబయలు మండలం కొరవంగి నుంచి సుమారు 15 మంది ప్రయాణికులు జీపులో పెదబయలు వస్తున్నారు. మార్గ మధ్యలో గల బంగారుమెట్ట సమీపంలో ఎదురుగా వస్తున్న కారును తప్పించే క్రమంలో జీపు అదుపు తప్పి పక్కనే ఉన్న లోయలోకి దూసుకుపోయింది. దీంతో జీపులో ఉన్న ప్రయాణికులకు గాయాలయ్యాయి. కొరవంగి గ్రామానికి చెందిన అప్పలమ్మకు నడుము, ఇతర భాగాల్లో తీవ్ర గాయాలు తగిలాయి. హుటాహుటీన ఆమెను పెదబయలు ఆస్పత్రికి తరలించగా ప్రాథమిక చికిత్సను అందించి జిల్లా ఆస్పత్రికి తరలించారు. స్వల్పంగా గాయపడిన వారికి పెదబయలులో వైద్యసేవలు అందించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేస్తామని ఎస్ఐ కె.రవీంద్ర తెలిపారు.

అత్యాచారం కేసులో పదేళ్లు జైలు

కొయ్యూరు, జూలై 1: అత్యాచారం కేసులో ముద్దాయికి విశాఖపట్నం ఎస్సీ ఎస్టీ న్యాయస్థానం పదేళ్ల జైలు శిక్ష, రూ.తొమ్మిది వేల జరిమాన విధిస్తూ తీర్పునిచ్చిందని స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 2021లో కొయ్యూరు పోలీసు స్టేషన్‌లో అత్యాచారం కేసు నమోదైందన్నారు. ఈ కేసు విచారణలో నేరం రుజురు కావడంతో ముద్దాయి సర్కారపు గిరీశ్‌కి పదేళ్ల జైలు శిక్ష, రూ.తొమ్మిదివేల జరిమాన, మరో ముద్దాయి సుర్ల విజయజ్యోతికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.ఆరు వేల జరిమాన విధించినట్టు చెప్పారు. ఈ కేసు విచారణలో నేరం రుజువు చేసేందుకు కృషి చేసిన పీపీ బి. వెంకట రమణమూర్తికి ఎస్పీ తుహిన్ సిన్హా, పోలీసు అధికారులు అభినందించారని సీఐ పీవీ రమణ తెలిపారు.

దొంగకు మూడేళ్ల జైలు

కొయ్యూరు, జూలై 1: దేవాలయంలో జరిగిన దొంగతనం కేసులో ముద్దాయికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.ఐదు వేల జరిమాన విధిస్తూ చోడవరం 9వ అడిషనల్ జడ్జి తీర్పు చెప్పారని స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కొయ్యూరు పోలీసు స్టేషన్ పరిధిలో 2012లో దేవాలయంలో దొంగతనం జరిగిందని, దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. ఈ కేసును విచారించిన చింతపల్లి జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ న్యాయస్థానం 2015లో ముద్దాయి వేములపూడి ఉషాకిరణ్‌కి మూడేళ్ల జైలు శిక్ష, రూ.ఐదు వేల జరిమాన విధిస్తూ తీర్పునిచ్చిందన్నారు. ఈ తీర్పుపై ముద్దాయి హైకోర్టులో అపీల్ చేసుకోవడం జరిగిందన్నారు. ముద్దాయి అపీల్‌ను చోడవరం 9వ అదనపు జడ్జి కొట్టివేసి, దిగువ కోర్టు ఇచ్చిన తీర్పును ఖరారు చేసిందన్నారు. ముద్దాయి ఉషాకిరణ్‌ని సెంట్రల్ జైలుకు తరలించాలని ఆదేశించడం జరిగిందని సీఐ పీవీ రమణ తెలిపారు.

జిల్లా అంతటా తేలికపాటి జల్లులు

అనకాపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం పలు మండలాల్లో తేలికపాటి జల్లులు పడ్డాయి. రోజంతా మబ్బులతో చల్లని వాతావరణం నెలకొంది. జిల్లా కేంద్రం అనకాపల్లి, మునగపాక, కశింకోట మండలాల్లో రోజంతా వాతావరణం మేఘావృతమైంది. ఉదయం కొద్ది సేపు తేలికపాటి జల్లులు కురిశాయి. నర్సీపట్నం, గొలుగొండ, రావికమతం, పరవాడ, అచ్యుతాపురం మండలాల్లో వర్షపు జల్లులు పడ్డాయి.

ట్రిపుల్ ఐటీలో ప్రవేశాలకు కశింకోట విద్యార్థులు ఎంపిక



కె.దిలీప్‌భగవాన్



వై.చందురాజు



ఎన్.నవీన్

కశింకోట, జూలై 1 : నూజివీడులోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జి టెక్నాలజీస్ ట్రిపుల్ ఐటీ ప్రవేశానికి కశింకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎంఆర్‌వీ అప్పారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కె.దిలీప్ భగవాన్, వై. చందురాజు, ఎన్.నవీన్‌లు ఎంపికయ్యారని వీరు ఈ నెల నాలుగో తేదీన ధ్రువపత్రాల పరిశీలనకు నూజివీడు వెళ్లనున్నారని వివరించారు. వీరికి ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలిపారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	117.00
లైవ్ ధర	137.00
విత్ స్కిన్	244.00
స్కిన్ లెస్	254.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

పింఛనుదారుల్లో ఉప్పొంగిన ఆనందం

పెంచిన పింఛన్లను పంపిణీ చేసిన కూటమి నేతలు, అధికారులు

రూ.ఏడు వేలు తీసుకోవడంతో సంతోషపడిన లబ్ధిదారులు

చంద్రబాబు పెద్ద కొడుకులా ఆదుకున్నాడంటూ దీవించిన పండుటాకులు

ఎన్టీఆర్ భరోసా పింఛన్ సొమ్మును సోమవారం ఉదయం ఆరు గంటలకే అందుకున్న అవ్వ,తాతాలు ఆనందం వ్యక్తం చేశారు. ఒకేసారి రూ.ఏడు వేలు అందుకున్న వారంతా నోట్లను లెక్క పెట్టుకొని మురిసిపోయారు. తెలుగుదేశం పార్టీ ఎన్నికల్లో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పెంచిన ఎన్టీఆర్ సామాజిక పింఛన్లను బకాయిలతో కలిపి ఏడు వేల రూపాయలను ప్రజాప్రతినిధులు, కూటమి నేతలు, అధికారులు పంపిణీ చేశారు.

మాటల్లో కాదు చేతల్లో చూపుతున్నారు

జక్కా లక్ష్మీనారాయణ, లక్కవరం, ఎలమంచిలి మండలం



సామాజిక పెన్షన్ల పెంపు గొప్పది. ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం పెంచిన నగదు ఒకేసారి పంపిణీ చేయడం రికార్డ్ బ్రేక్. జీవితంలో పెన్షన్ రూపంలో ఏడు వేల రూపాయలు ఒకే సారి అందుకోవడం చాలా ఆనందంగా ఉంది. పాలన అంటే మాటలు కాదు చేతలని చంద్రబాబు నిరూపిస్తున్నారు.

ఎల్లప్పుడూ రుణపడి ఉంటాం

ఒమ్మి అబద్దం, పెదపల్లి, ఎలమంచిలి



ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ల సొమ్ము పంపిణీ చేయడం చాలా ఆనందంగా ఉంది. నా జీవితంలో ఇంత పెన్షన్ డబ్బులు అందుకోవడం ఇదే మొదటి సారి. ముఖ్యమంత్రి అయిన వెంటనే చంద్రబాబు మాకు ఇచ్చి వరం ఇది. ఆయనకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటాం.

చంద్రబాబును భగవంతుడు చల్లగా చూడాలి

యండపల్లి కన్నమ్మ, వృద్ధురాలు, యండపల్లివలస, అరకులోయ



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిండా నూరేళ్ల చల్లగా ఉండాలి. పేదలకు అండగా నిలివాలి. ప్రజలకు మంచి పరిపాలన అందించాలి. తమలాంటి పండుటాకులకు వెయ్యి రూపాయలు ఒక్కసారే పెంచినందుకు ధన్యవాదాలు.

మా ఇంటికి చంద్రబాబు పెద్ద కొడుకు

చిటికెల సన్యాసిమ్మ, లింగాపురం, కోటవురట్ల మండలం



ఎన్నికల ముందు చెప్పినట్టే చంద్రబాబునాయుడు రూ. నాలుగు వేలు పెన్షన్ అందించడం చాలా సంతోషంగా ఉంది. ఇన్నాళ్లు చాలీచాలని పెన్షన్ డబ్బులతో ఇబ్బందులు పడ్డాం. నా కుటుంబంలో నాతోపాటు నా కుమార్తెకు వింతు పెన్షన్ ఇస్తూ చంద్రబాబు పెద్ద కొడుకులా ఆదుకుంటున్నారు.

చంద్రబాబు పెద్దకొడుకులా ఆదుకున్నాడు

మజ్జి దేవయ్య, దబ్బాపుట్టు గ్రామం, పాడేరు మండలం



ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల హామీలో భాగంగా పింఛన్‌ను రూ.వెయ్యి పెంచి నా పెద్ద కొడుకులా ఆదుకున్నాడు. నా లాంటి వృద్ధులను ఆర్థికంగా ఆదుకోవడం ఆనందంగా ఉంది. కొడుకులు, సంరక్షణ లేని వృద్ధులకు ఈ పింఛన్ పెంపుతో భరోసా లభించింది.

పిల్లలను పోషించుకొనే ధైర్యం వచ్చింది

కొండపూజారి ఈశ్వరమ్మ(వితంతువు), మినుములూరు, పాడేరు మండలం



ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఎన్నికల హామీలో భాగంగా పింఛన్ రూ.4 వేలు అందించడంతో పిల్లలను పోషించుకొనే ధైర్యం వచ్చింది. భర్త మరణించిన తరువాత కూలీ, నాలీ చేసి ముగ్గురు పిల్లలను పెంచుకుంటూ వస్తున్నాను. నెలకు రూ.4 వేలు పింఛన్‌ను అందించడంతో మరింత ధైర్యం వచ్చింది.

సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు



కలెక్టరేట్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, జేసీ జాహ్నవి



ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

- ప్రతి అర్జీని పరిశీలించి సత్వర న్యాయం చేయాలి
- అధికారులకు కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ఆదేశం

అనకాపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : నూతన ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రజా సమస్యలపై అందుతున్న దరఖాస్తులను పరిశీలించి, సత్వర పరిష్కారం చూపాలని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఆయన స్వయంగా దరఖాస్తులను స్వీకరించి, సంబంధిత శాఖల అధికారులకు బదలాయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారి అర్జీలను పరిశీలించి ఎటువంటి ఆలస్యం చేయకుండా పరిష్కారం చూపాలన్నారు. లేని పక్షంలో కనీసం అర్జీదారునికి ఎందుకు ఆలస్యం అవుతున్నది అనే అంశంపై సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. మొత్తం 136 అర్జీలు అందాయి. వీటిలో 82 ఫిర్యాదులు రెవెన్యూ, భూ సమస్యలపై ఉన్నాయి. ఈ కార్యక్రమంలో జేసీ జాహ్నవి, డీఆర్‌వో శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయానికి 22 ఫిర్యాదులు

జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 22 ఫిర్యాదులు అందాయి. ఎస్పీ మురళీకృష్ణ స్వయంగా వీటిని స్వీకరించి, సంబంధిత పోలీసు స్టేషన్‌ల అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, ఎస్ఐ సావిత్రి పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఉచిత వైద్య పరీక్షలు

అనకాపల్లి టౌన్, జూలై 1 : జిల్లాలోని అక్రిడేటెడ్ జర్నలిస్టులకు ఇక్కడి ఉషాప్రైమ్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో సోమవారం ఉచిత వైద్య పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, జిల్లా కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధి నిర్వహణలో నిరంతరం బిజీగా ఉండే జర్నలిస్టులకు వారి ఆరోగ్యం పట్ల జిల్లా యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధతో ఉచిత వైద్య పరీక్షలను చేయిస్తున్నట్టు చెప్పారు. రోజుకి 50 మంది చొప్పున ఉచిత వైద్య పరీక్షలు ఆస్పత్రిలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ బాలాజీ, ఆస్పత్రి ఎండీ డాక్టర్ అవినాష్, ఆర్డీవో చిన్నికృష్ణ, ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ రంజిత్, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

కుస్తీ పోటీలలో సత్తా చాటిన కొయ్యూరు విద్యార్థులు

కొయ్యూరు, జూలై 1: జాతీయ స్థాయి కుస్తీ పోటీలలో ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొయ్యూరు కుస్తీ శిక్షణ కేంద్ర విద్యార్థులు సత్తా చాటారు. ఈ మేరకు కోచ్ అంబటి నూకరాజు విలేకర్లతో మాట్లాడుతూ.. గత నెల 28, 29 తేదీల్లో తమిళనాడులోని మెట్టూరులో జరిగిన అండర్-23 సౌత్ జోన్ నేషనల్ లెవిల్ కుస్తీ పోటీలలో పాలిక బుజ్జిబాబు 55 కేజీల విభాగం(ఫ్రీ స్టైల్), ముద్దారు రమణ 55 కేజీల విభాగం (గ్రీకో రోమన్ స్టైల్), గంధం అశోక్ 63 కేజీల విభాగం (గ్రీకో రోమన్ స్టైల్)లో కాంస్య పతకాలు సాధించారు. ఈ మేరకు విజేతలను రాష్ట్ర రెజ్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి రమణ, ఏపీ కోచ్ శివాజీ,స్థానిక ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్ హర్షం వ్యక్తం చేశారు.

జగన్ ప్రభుత్వంలో ఒక్కొక్కరిపై రూ. ఐదు లక్షల అప్పు

- రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత

ఎస్.రాయవరం, జూలై 1: జగన్ ఐదేళ్ల పాలనలో ఒక్కొక్కరిపై రూ. ఐదు లక్షల చొప్పున అప్పు ఉందని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. సోమవారం మండలంలోని పెదగుమ్ములూరులో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ఆమె పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో అనిత మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మాటను నెరవేర్చారని, చంద్రబాబు నిత్యం పేద ప్రజల బాగు కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసమే ఆలోచిస్తారన్నారు. నియోజకవర్గంలో సుమారు 47,267 మందికి రూ. 30,84,33,800 అందజేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం లబ్ధిదారులతో కలిసి మంత్రి అనిత భోజనం చేశారు. అంతకు ముందు గ్రామానికి వచ్చిన మంత్రి అనితను మాజీ ఎంపీపీ వినోద్‌రాజు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కె. నాగరత్నం, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, ఎస్.రాయవరం, పాయకరావుపేట, కోటవురట్ల మండలాల పార్టీ అధ్యక్షులు అమలకంటి అబద్ధం, పెద్దిరెడ్డి చిట్టిబాబు, జానకి శ్రీను, టీడీపీ నేతలు వెంకటరాజు, నవీన్‌రాజు, గుర్రం రామకృష్ణ, తుమ్మపాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.



పెదగుమ్ములూరులో లబ్ధిదారురాలికి పెన్షన్ సొమ్ము పంపిణీ చేస్తున్న హోం మంత్రి వంగలపూడి అనిత

చెలరేగిన భరత్...వైజాగ్ వారియర్స్ గెలుపు

విశాఖపట్నం (స్పోర్ట్స్), జూలై 1: ఏపీఎల్ సీజన్-3 టోర్నీలో భాగంగా సోమవారం ఇక్కడి ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో జరిగిన తొలి మ్యాచ్‌లో వైజాగ్ వారియర్స్ ఆరు వికెట్ల తేడాతో బెజవాడ టైగర్స్‌పై విజయం సాధించింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన బెజవాడ టైగర్స్ నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లకు 143 పరుగులు చేసింది. కేవలం 12 పరుగులకే ఓపెనర్లు అభినవ్ (0), మహదీప్‌కుమార్ (7) అవుటయ్యారు. తర్వాత స్థానాల్లో దిగిన ధ్రువకుమార్‌రెడ్డి (12), కెప్టెన్ రిక్కీబుయ్ (16) కూడా విఫలమవ్వడంతో కేవలం 55 పరుగులకే నాలుగు కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది.

అయితే మిడిల్ ఆర్డర్‌లో వచ్చిన మనీష్ (44; 4 బౌండరీలు, 1 సిక్సర్), పైలా అవినాష్ (23; 2 ఫోర్లు, 1 సిక్సర్), కేపీ సాయి రాహుల్ (30: 1 బౌండరీ, 3 సిక్సర్లు) రాణించడంతో 143 పరుగుల స్కోరును సాధించింది. వైజాగ్ వారియర్స్ బౌలర్లలో కె.సుదర్శన్ (3/30), యద్దాల రెడ్డి (1/18), యశ్వంత్ (1/23) రాణించారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన వైజాగ్ వారియర్స్ 19.1 ఓవర్లలో నాలుగు వికెట్లు నష్టపోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఓపెనర్లు బండారు సుజన్ (27), అశ్విన్ హెబ్బర్ (35; 3 బౌండరీలు, 2 సిక్సర్లు) శుభారంభాన్నివ్వగా, మిడిల్ ఆర్డర్‌లో దిగిన టీమిండియా క్రికెటర్, వైజాగ్ వారియర్స్ సారథి శ్రీకర్ భరత్ (46 నాటౌట్; 26 బంతుల్లో 3 బౌండరీలు, 3 సిక్సర్లు) చెలరేగి స్కోరు బోర్డును పరిగెత్తించాడు. చివర్లో మనిష్ వర్మ (11; 2 బౌండరీలు), ముప్పల శివ (20: 3 బౌండరీలు) మెరిపించడంతో ఐదు బంతులు మిగిలి ఉండగానే వైజాగ్ వారియర్స్ విజయం సొంతం చేసుకున్నది. బెజవాడ టైగర్స్ బౌలర్లలో శంభు అఖిల్ (2/17), సాయితేజ (1/27), కేపీ సాయి రాహుల్ (1/26) రాణించారు. గేమ్ ఛేంజర్‌గా కేఎస్ భరత్, సూపర్ స్ట్రైకర్‌గా సాయి రాహుల్, మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా బెజవాడ టైగర్స్ బౌలర్ సుదర్శన్ (3/30) నిలిచారు.



కేఎస్ భరత్

కొత్త క్రిమినల్ చట్టాలకు వ్యతిరేకంగా న్యాయవాదులు నిరసన



కోర్టు సముదాయాల ఎదుట నిరసన తెలియజేస్తున్న న్యాయవాదులు

అనకాపల్లి టౌన్, జూలై 1 : కేంద్ర ప్రభుత్వం ఈనెల ఒకటో తేదీ నుంచి అమలు జరుపుతున్న మూడు క్రిమినల్ చట్టాలను వ్యతిరేకిస్తూ అనకాపల్లి కోర్టు సముదాయాల ఎదుట న్యాయవాదులు సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంజేవీఎస్ కుమార్ మాట్లాడుతూ న్యాయవాదులకే కాకుండా సామాన్య ప్రజలను కూడా గందరగోళంలో పడేసేలా పౌర న్యాయ సూత్రాలకు వ్యతిరేకంగా చట్టాలు ఉన్నాయని, తక్షణమే వాటిని కేంద్ర ప్రభుత్వం ఉప సంహరించుకోవాలని కోరారు. ఇందుకు సంబంధించి ఈ నెల ఎనిమిదో తేదీన విశాఖపట్నం బార్ అసోసియేషన్‌లో జరిగే సమావేశంలో తదుపరి కార్యాచరణ తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బంధం నూక దుర్గారావు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

కమలేష్ చంద్ర కమిటీ సిఫార్సులు అమలు చేయాలి

- తపాలా ఉద్యోగుల సమావేశంలో ఏఐజీడీఎస్ జాతీయ నాయకుడు బీవీ రావు డిమాండ్

అనకాపల్లి టౌన్, జూలై 1 : అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్న గ్రామీణ తపాలా ఉద్యోగులకు గత ప్రభు త్వం వేసిన కమలేష్‌చంద్ర కమిటీ సిఫార్సులను అమలు చేసి ఆదుకోవాలని ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ జాతీయ నాయకుడు బీవీ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక కోడుగంటి గోవిందరావు భవనంలో ఎస్.సతీష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు. గ్రామీ ణ తపాలా ఉద్యోగులకు రూ.ఐదు లక్షలు గ్రాడ్యూటీ, రూ.ఐదు లక్షల వరకు కుటుంబ సభ్యులకు కలిపి వైద్య బీమా, మరో రూ.ఐదు లక్షలు గ్రూప్ ఇన్సూరెన్స్ అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం వేసిన కమిటీ సిఫార్సులను ప్రస్తుత ప్రభుత్వం అమలు చేయకుండా తాత్సారం చేయడం తగదన్నారు. డిపార్టుమెంట్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల మాదిరిగానే గ్రామీణ తపాలా ఉద్యోగులకు వేతన సవరణ జరపాలని కోరినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ నాయకులు వీవీ రామకృష్ణ, పి.భూలోకం, ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు వైఎస్ భద్రం, మండల శాఖ అధ్యక్షుడు శ్రీరామదాసు అబ్బులు, తపాలాశాఖ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

హైడ్రో పవర్ ప్రాజెక్టు కోసం సర్వే వద్దు



ఎరియా జలపాతం సమీపంలో నిరసన తెలుపుతున్న గిరిజనులు

దేవరాపల్లి, జూలై 1: అనంతగిరి మండలం సరియా జలపాతం సమీపాన రిజర్వు ఫారెస్టు వద్ద హైడ్రో పవర్ ప్రాజెక్టు కోసం అదానీ కంపెనీ కోల్‌కత్తాకు చెందిన కొంత మందితో చేపడుతున్న సర్వే నిలిపివేయాలని గిరిజనులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి.వెంకన్న సోమవారం గిరిజన సంఘం నాయకులతో కలిసి ఈ పవర్ ప్రాజెక్టు స్థలాన్ని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేవరాపల్లి మండలం వాలాబు, చీడికాడ మండలం కోణాం, అనంతగిరి మండలం సరియా గ్రామాల గిరిజనులకు పవర్ ప్రాజెక్టుతో తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో చేపడుతున్న సర్వేను నిలుపు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బి.టిడొర, జర్రా రామరాజు, రాజిబాబు, అప్పరాజు, లక్ష్మణ పాల్గొన్నారు.


ఎలమంచిలిలోని పాతవీధిలో పెన్షన్ అందిస్తున్న ఎమ్మెల్యే సుందరపు


అచ్యుతాపురం: దిబ్బపాలెంలో చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు పాలాభిషేకం


పరవాడలో పింఛన్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు


సబ్బవరం : మల్లునాయుడుపాలెంలో నగదు అందిస్తున్న గండి బాబ్జీ

ఎటు చూసినా సందడే కనిపింఛెన్

» వాడవాడలా సామాజిక పింఛన్ల పంపిణీ » ఎన్నికల ముందు హామీ మేరకు నగదు చేతికి అందడంతో లబ్ధిదారుల కళ్లలో ఆనందం

» సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ చిత్రపటాలకు క్షీరాభిషేకాలు » ఎమ్మెల్యేలతో పాటు ఉత్సాహంగా పాల్గొన్న కూటమి శ్రేణులు

అనకాపల్లి టౌన్, జూలై 1 : జిల్లాలో పింఛన్ల పంపిణీ సోమవారం పండగ వాతావరణంలో సాగింది. ఇందులో భాగంగా అనకాపల్లి పట్టణంలోని గవరపాలెం బోయిగూడెంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ నేత బుద్ద నాగజగదీశ్వరరావు, డాక్టర్ కెకెవీపీ నారాయణరావు, బీఎస్ఎంకే జోగినాయుడు పాల్గొన్నారు. అలాగే, కోట్నీవీధి, వేల్పులవీధిలలో కూడా లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. మిరియాలకాలనీ సచివాలయ పరిధిలో గల ఉడ్‌పేటలో లబ్ధిదారులకు జిల్లా కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి పింఛన్లు పంపిణీ చేశారు. ఇదిలావుంటే, తెల్లవారుజాము నుంచి వర్షం కురుస్తున్నా సచివాలయ సిబ్బంది తెల్లవారుజామున ఐదున్నర గంటలకే ఆయా ప్రాంతాలకు వెళ్లి నగదుతో సిద్ధమయ్యారు. కూటమి నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న పలువురి ఇళ్లకు వెళ్లి ఎమ్మెల్యే కొణతాల, మాజీ ఎమ్మెల్యే పీలా, బుద్ద నాగజగదీశ్వరరావు, కూటమి నాయకులు పింఛన్ల నగదు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో జీవీఎంసీ జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు, ఏపీడీవో దొరతో పాటు తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కొత్తూరు : అనకాపల్లి పట్టణంలోని జీవీఎంసీ 81వ వార్డు నెయ్యిల వీధిలో ఎమ్మెల్యే కొణతాల, రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద నాగజగదీశ్వరరావు కలిసి పెన్షన్లను పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు డాక్టర్ కేకేవీపీ నారాయణరావు, కర్రి మల్లేశ్వరరావు, నాయుడు పాల్గొన్నారు. అలాగే సంపతిపురం, కుంచంగి, కూండ్రం, వేట జంగాలపాలెం, సుందరయ్యపేట, వెంకుపాలెం గ్రామాలకు వెళ్ళి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. సర్పంచ్‌లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కశింకోట : మండల కేంద్రం కశింకోటలో పింఛన్ల పంపిణీ పండగ వాతావరణంలో సాగింది. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అవ్వాతాతలకు పెన్షన్లను పంపిణీ చేశారు. కూటమి నాయకులు సిదిరెడ్డి శ్రీనివాసరావు, వేగి గోపీకృష్ణ, కాండ్రేగుల సతీష్, మళ్ల లోవకృష్ణ, సత్యనారాయణ, పెంటకోట రాము, బుదిరెడ్డి మోహన్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా తాళ్ళపాలెం, నర్సింగబిల్లి, సోమవరం, భీమవరం తదితర గ్రామాల్లో ఇంటింటికీ కూటమి నాయకులు వెళ్ళి పింఛన్లు అందజేశారు అలాగే, కొద్ది కాలంగా పక్షవాతంతో బాధపడుతున్న నక్కిన సత్యానందంకు ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ను టీడీపీ మండల అధ్యక్షుడు కాయల మురళీధర్ అందజేశారు. సర్పంచ్ రెట్లు నాగయ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట నియోజకవర్గంలో....

పాయకరావుపేట : పట్టణంలోని దుర్గాకాలనీలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్, టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు తదితరులు పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, యాళ్ళ వరహాలబాబు, గొర్రెల రాజబాబు, మజ్జూరి నారాయణరావు, పల్లా విలియంకేరీ, గూటూరు శ్రీనివాసరావు, సూరా సుబ్రహ్మణ్యం, ఎం.రమాకుమారి, కశింకోట సత్తిబాబు, వేములపూడి అప్పారావులతోపాటు జనసేన నాయకులు ఆచంట దొర, ఎన్.పద్మావతి, బీఎస్.నారాయణ, బీజేపీ నాయకులు కువల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట రూరల్ : మండలంలోని గుంటపల్లిలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి పెన్షన్లను పంపిణీ చేశారు. మాసాహెబ్‌పేట, గోపాలపట్నం, పెంటకోట, మంగవరం, పెదరాంభద్రపురం, సత్యవరం, శ్రీరాంపురం, వెంకటనగరం, పాల్తేరు, తదితర గ్రామాలలో టీడీపీ నాయకులు కంకిపాటి వెంకటేశ్వరరావు, చిక్కాల శ్రీనివాసరావు, గణపర్తి దొర, కె.సతీష్‌రాజు, గోపిరాజు, శింగంశెట్టి నాగేశ్వరరావు, చించలపు పద్దు, వంకా వెంకటరమణ, బొంది కాశీవిశ్వనాథ్ తదితరులు అందజేశారు.


జీవీఎంసీ 81వ వార్డులో వృద్ధురాలికి పింఛన్ నగదును అందజేస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా, బుద్ద నాగజదీష్ తదితరులు


అనకాపల్లి మిరియాల కాలనీలో వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

నక్కపల్లి : మండలంలోని గ్రామ గ్రామాన సోమవారం ఉదయం నుంచి పండుగ వాతావరణం నెలకొంది. ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీ ప్రకారం పెంచిన పెన్షన్లు కూటమి నాయకులతో పాటు సచివాలయ సిబ్బంది లబ్ధిదారులకు అందజేశారు. ఉపమాకలో తెలుగు రైతు రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కొప్పిశెట్టి కొండబాబు, దేవస్థానం మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి, సర్పంచ్ ప్రగడ వీరబాబు పంపిణీని ప్రారంభించారు. నక్కపల్లిలో కూటమి నాయకులు వెంకటేశ్, కోసూరి శ్రీను,పెంకుల రాజు, మీగడ సత్తిబాబు, కేవీ సత్యనారాయణ తదితరులు పెన్షన్ల సొమ్మును అందజేశారు.

కోటవురట్ల: మండలంలోని గ్రామ గ్రామాన పింఛన్ల పంపిణీని పండగ వాతావరణంలో నిర్వహించారు. తొలుత కైలాసపట్నంలో మండల ప్రత్యేకాధికారిణి ఉదయశ్రీ, ఎంపీడీవో కాశీవిశ్వనాథం పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. జల్లూరులో టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి లాలం కాశీనాయుడు, సర్పంచ్ పద్మావతి పింఛన్ల నగదును అందజేశారు. కోటవురట్లలో టీడీపీ మండల అధ్యక్షుడు జానకి శ్రీనివాసరావు, ఎంపీటీసీ పి.సూర్యారావు, అన్నవరం గ్రామంలో టీడీపీ సీనియర్ నాయకులు శెట్టి విశ్వనాథం, పైల రామలక్ష్మి తదితరులు పింఛన్ల నగదును పంపిణీ చేశారు.

ఎలమంచిలి నియోజకవర్గంలో...

ఎలమంచిలి : కూటమి ప్రభుత్వం పెంచిన పింఛన్లతో పేదల జీవితాల్లో వెలుగులు నింపినట్లైందని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. ఎలమంచిలి పట్టణంతో పాటు మండలంలోని పోతిరెడ్డిపాలెంలో సోమవారం ఆయన పింఛన్లను పంపిణీ చేసి మాట్లాడారు. వైసీపీ పాలనలో అన్నిరంగాల్లో నష్టపోయిన రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడపడమే ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ లక్ష్యంగా పేర్కొన్నారు. కూటమి నాయకులు బొద్దపు శ్రీను, కొఠారు సాంబ, కొఠారు నరేష్, బాబులు, కొఠారు శ్రీను, రాము, చిట్టిబాబు, గంధం శివ, సర్పంచ్ ఇత్తంశెట్టి సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు. అలాగే, మునిసిపాలిటీలోని పాతవీధి, పెదపల్లి వార్డుల్లో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, జనసేన, బీజేపీ నాయకులు బొద్దపు శ్రీను, పప్పు ఈశ్వరరావు తదితరులు పింఛన్లను పంపిణీ చేశారు. కూటమి నాయకులు బొద్దపు శ్రీను(రమణ) బొద్దపు నాగేశ్వరరావు, గణేష్, డి.స్వామి, తదితరులు పాల్గొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పింఛన్ల నగదు పెంపుపై హర్షం వ్యక్తం చేస్తూ రామారాయుడుపాలెం వార్డులో ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ల చిత్రపటాలకు కూటమి నాయకులు క్షీరాభిషేకం చేశారు. అనంతరం పింఛన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు గొర్లె బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : పింఛన్ల పంపిణీ సోమవారం పండగ వాతావరణంలో సాగింది. ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ సెజ్ పునరావాస కాలనీలో గల ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. అలాగే టీడీపీ ఎలమంచిలి ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, నియోజక వర్గ పరిశీలకుడు బొండ జగన్నాథం చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్ కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు జనపరెడ్డి నర్సింగరావు, మాజీ జడ్పీటీసీ జనపరెడ్డి శ్రీనివాసరావు, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డ్రీమ్స్ నాయుడు, బైలపూడి శ్రీరామదాసు, పీలా తులసీరామ్, రెడ్డి నగేష్, మేరుగు బాపునాయుడు, గాయత్రి నాయుడు బాబు తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లి : మండలంలోని కొత్తూరు, మామిడివాడ, నారాయణపురం, పంచదార్ల, వెంకటాపురం పంచాయతీలలో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ సోమవారం పింఛన్లను పంపిణీ చేశారు. గోకివాడలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, హరిపురంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ధూళి రంగనాయకులు, లాలంకోడూరులో మాజీ జడ్పీ చైర్‌పర్సన్ లాలం భవానీ ఆయా సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో కలిసి లబ్ధిదారులకు పింఛన్ల నగదును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటాచలం, టీడీపీ, జనసేన మండల అధ్యక్షులు వి.దిన్‌బాబు, పప్పల నూకన్నదొర, నేతలు డీఎస్ఎన్ రాజు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పరవాడ నియోజకవర్గంలో...

పరవాడ : పింఛన్ల పంపిణీ మండల వ్యాప్తంగా పండగలా సాగింది. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు పరవాడ, దేశపాత్రునిపాలెంలలో లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్, మాజీ ఎంపీపీ పైలా జగన్నాథరావు, పరవాడ సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు, కూటమి నాయకులు రెడ్డి శ్రీనివాసరావు, పైలా రామచంద్రరావు, వియ్యపు చిన్న , మచ్చా శివకుమార్, పిళ్లా శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు. తానాంలో సీఎం చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పెందుర్తి నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జి సమక్షంలో పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం లబ్ధిదారులకు పింఛన్ల నగదు అందజేశారు. జడ్పీటీసీ మాజీ పైలా జగన్నాథరావు, సర్పంచ్ కన్నూరి దేవి, నాయకులు కన్నూరి వెంకటరమణ, వర్రి పరదేశినాయుడు, డీఎంఎల్ నాయుడు పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని గ్రామ గ్రామాన పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. సబ్బవరం సాయినగర్ కాలనీ, అసకపల్లిలలో ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, అలాగే, పెందుర్తి నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ మొగలిపురం, మల్లునాయుడుపాలెం, బాటజంగాలపాలెం, బంగారమ్మపాలెం గ్రామాల్లో పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు కూటమి ప్రభుత్వ లక్ష్యాలను వివరించారు. ఈ కార్యక్రమాల్లో వైస్ ఎంపీపీ ఝాన్సీరాణి, కూటమి నేతలు బాబూరావు, పీబీవీఎస్ఎన్ రాజు, ఇందలి రమణ, సాలాపు వెంకటేశ్వరరావు, మహాలక్ష్మీనాయుడు, కర్రి కనకరాజు, గండి దేముడు, బీపీ రావు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


పాయకరావుపేట రూరల్ : గుంటపల్లిలో పెన్షన్ అందిస్తున్న గెడ్డం బుజ్జి


పాయకరావుపేట దుర్గాకాలనీ...


నక్కపల్లి మండలం ఉపమాకలో...


కోటవురట్ల మండలంలో అన్నవరం గ్రామంలో...

' కసూర్బా'లో డార్మిటరీ నిర్మాణానికి శ్రీకారం

అచ్యుతాపురం, జూలై 1 : యోకోహమా టైర్ల కర్మాగారం సీఎస్ఆర్ నిధులతో స్థానిక కసూర్బా పాఠశాలలో డార్మిటరీ నిర్మాణం పనులకు సోమవారం ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో సెజ్‌లో గల అన్ని కర్మాగారాల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటుచేసి ఎలమంచిలి నియోజకవర్గం అభివృద్ధికి సహకరించాల్సిందిగా కోరనున్నట్టు చెప్పారు.పాఠశాల ప్రిన్సిపాల్ ఉమాదేవితో పాటు యోకోహమా ప్రతినిధులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లలో ఉండలేం..

... 5వ పేజీ తరువాయి

టిడ్కో గృహ సముదాయాల బాధ్యత తీసుకోలేదు. దీంతో సమస్యను ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాక ఇబ్బందులు పడుతున్నామని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందుకే పూర్తి స్థాయిలో లబ్ధిదారులు ఇళ్లల్లోకి దిగలేదు. కానీ బ్యాంకుకు మాత్రం రుణం కింద నెల నెలా రూ.3,500 నుంచి రూ.4,000 వరకు చెల్లించాల్సి వస్తోందని వారు గగ్గోలు పెడుతున్నారు. కూటమి ప్రభుత్వం రావడంతో తమ కష్టాలు తీర తాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అంతటా పింఛన్ పండగ

... 5వ పేజీ తరువాయి

అధికారంలోకి వచ్చిన వెంటనే గత వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన రూ.3 వేలు పింఛన్‌ను రూ.4 వేలుకు, దివ్యాంగులకు రూ.6 వేలు పెంచుతూ సీఎం చంద్రబాబునాయుడు నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. పెంచిన మొత్తాన్ని ఏప్రిల్ నుంచి వర్తింపజేస్తామని హామీ ఇచ్చారు. సోమవారం ఉదయం 6 గంటల నుంచి జిల్లాలో 522 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాలు మొదలు పెట్టి, తొలిరోజే సాయంత్రం 5 గంటల సమయానికి 83.52 శాతం పంపిణీ పూర్తయింది.

తొలిరోజు 83.52 శాతం పంపిణీ పూర్తి

జిల్లా వ్యాప్తంగా 2,64,033 మంది లబ్ధిదారులు ఉండగా తొలిరోజైన సోమవారం సాయంత్రం 5 గంటల సమయానికి 2,20,533 మందికి (83.52 శాతం) పింఛన్లు పంపిణీ చేశారు. మిగిలిన వారందరికీ రెండో రోజు అందజేయనున్నారు. కె.కోటపాడు మండలంలో అత్యధికంగా 93.99 శాతం మందికి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ మండలంలో 11,002 మంది లబ్ధిదారులుండగా, అందులో 10,321 మందికి తొలిరోజు పింఛన్ల పంపిణీ పూర్తి చేశారు. అనకాపల్లి అర్బన్‌లో 92.36 శాతం, సబ్బవరంలో 90.16 శాతం పింఛన్లు అందజేశారు. చివరి స్థానంలో ఎస్.రాయవరం మండలంలో 71.79 శాతం, రావికమతం 75.26 శాతం, నక్కపల్లి 76.11 శాతం ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా తొలిరోజు అన్ని మండలాల్లో 83.52 శాతానికి పైబడి పింఛన్ల పంపిణీ పూర్తయిందని డీఆర్‌డీఏ అధికారులు తెలిపారు.

మందుల ఖర్చు కోసం వెతుక్కోవలసిన పని లేదు



నాకు కిడ్నీ ఆపరేషన్ అయిన తరువాత గత ప్రభుత్వం ఐదు వేల రూపాయలు పింఛన్ ఇచ్చేది. నాకు మందుల ఖర్చు రూ.9 వేల వరకు కావడంతో అదనంగా నాలుగు వేల రూపాయల కోసం వెతుక్కునే పరిస్థితి ఉండేది. కూటమి ప్రభుత్వం రూ.10 వేలు పింఛన్ అందించడం చాలా ఆనందంగా ఉంది. మందులతో పాటు చార్జీలకు కూడా వెతుక్కోవలసిన అవసరం లేదు. - మామిడి నాగరాజు, మాడుగుల

అంటు వ్యాధులపై అవగాహన ర్యాలీలు




అనకాపల్లి, కశింకోటలలో ర్యాలీలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, విద్యార్థులు

అనకాపల్లి టౌన్, జూలై 1 : అతిసారపై పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎన్టీఆర్ వైద్యాలయం నుంచి పురవీధుల గుండా నెహ్రూచౌక్ వరకు ర్యాలీ సాగింది. డీఎం హెచ్‌వో బాలాజీ మాట్లాడుతూ జూలై ఒకటి నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామన్నారు. అతిసార వ్యాధి నివారణలో భాగంగా ఐదేళ్ల లోపు పిల్లలందరికీ ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు చంద్రశేఖర్ దేవ్, సతీష్‌కుమార్, ప్రశాంతి, గణాంకశాఖాధికారి రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే, డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లా మలేరియా అధికారి కె.వరహాలదొర ఆధ్వర్యంలో డెంగ్యూ పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. చింతావారివీధి, దేమునిగుమ్మం, మార్కెట్ మీదుగా ర్యాలీ సాగింది. అంటువ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సబ్ యూనిట్ ఆఫీసర్లు, హెల్త్ సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కశింకోట : మండల కేంద్రమైన కశింకోటలో అతిసార వ్యాధిపై సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారిణి యశోధ ఆధ్వర్యంలో సిబ్బంది అంటువ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆరోగ్య విస్తరణాధికారి సత్యనారాయణ, పారిమెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

పాయకరావుపేట : సీజనల్ వ్యాధులపై పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఇక్కడ అవగాహన ర్యాలీ నిర్వహించారు. తొలుత ఈ ర్యాలీని టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, వైద్యాధికారులు డాక్టర్ డి.సుభాష్, డాక్టర్ వీఎస్.సౌజన్య తదితరులు ప్రారంభించారు. టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : అతిసార వ్యాధి నుంచి పిల్లల్ని రక్షించుకుందామని అచ్యుతాపురం ప్రభుత్వ వైద్యాధికారిణి శ్రావ్య అన్నారు. సోమవారం పీహెచ్‌సీ ఆవరణలో అతిసార వ్యాధిపై ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. ఎంపీడీవో కె.సురేష్ కుమార్, కూండ్రపు వెంకునాయుడు, కె.చిన్నారావు, ద్వారపు రెడ్డి బాపూజీ తదితరులు పాల్గొన్నారు.

'భవన నిర్మాణ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి'

కొత్తూరు, జూలై 1 : వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిన భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించి సదరు కార్మికులను ఆదుకోవాలని ఏఐటీయూసి అనకాపల్లి జిల్లా గౌరవాధ్యక్షుడు వైఎస్ భద్రం కూటమి ప్రభుత్వాన్ని కోరారు. మామిడిపాలెంలో జరిగిన భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశంలో మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇసుక నూతన పాలసీ తీసుకురావడం వల్ల ఇసుక దొరకక నిర్మాణ రంగం కుదేలైందన్నారు. పనులు లేక కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులను అన్నివిధాలా ఆదుకోవాలని కోరారు. నాయకులు గోపాలం, మహాలక్ష్మి, ఎం. కాశీఅప్పారావు, అప్పలకొండ వెంకట్రావు, సత్తిబాబు, చెల్లూరు నాగరాజు పాల్గొన్నారు. ఇదే అంశంపై ఇక్కడి సత్యనారాయణస్వామి ఆలయం వద్ద జరిగిన సమావేశంలో భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకరరావు తదితరులు కోరారు.

కొత్త చట్టానికి వ్యతిరేకంగా ఆటో కార్మికులు ఆందోళన

పరవాడ, జూలై 1 : భారత న్యాయ సంహిత చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం లంకెలపాలెం- పరవాడ ప్రధాన రహదారిపై మండల ఆటో రిక్షా కార్మిక సంఘం ప్రతినిధులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టనున్న ఈ చట్టం ప్రకారం రోడ్డు ప్రమాద కేసుల్లో డ్రైవర్లకు ఏడు సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ.పది లక్షల వరకు జరిమానా విధించబడుతుందన్నారు. ఇది అత్యంత ప్రమాదకరమైనదని, దీనిని ఆటో రిక్షా కార్మికసంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. తక్షణమే ఈ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో లంకెలపాలెం ఆటో రిక్షా కార్మిక యూనియన్ నాయకులు ఎస్.గోవిందు, కె.అప్పారావు, ఎన్.మునిసిలి, డి.మధు, వై.నాగేష్, ఎస్.సన్యాసిరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం


బిదాన్‌చంద్రరాయ్ చిత్రపటం వద్ద సింహాద్రి ఎన్టీపీసీ సీజీఎం సిన్హా తదితరుల నివాళి

పరవాడ, జూలై 1 : సింహాద్రి ఎన్టీపీసీలో సోమవారం జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వైద్య పితామహుడు బిదాన్‌చంద్రరాయ్ చిత్రపటానికి సింహాద్రి సీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా పూలమాల వేసి నివాళులర్పించారు. వైద్యులు సమాజానికి చేస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సింహాద్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ కె.విజయ, టీటీ పాత్ర, స్థానిక జీవనరేఖ ఆస్పత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

అచ్యుతాపురం, జూలై 1 : రోడ్డు ప్రమాదంలో మృతుని కుటుంబానికి టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావుతో పాటు స్నేహితులు రూ.2.05 లక్షల ఆర్థిక సాయాన్ని సోమవారం అందజేశారు. అచ్యుతాపురానికి చెందిన పంచదార్ల లక్ష్మణ్ ఈ నెల 12న పాడేరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. నిరుపేద కుటుంబానికి చెందిన లక్ష్మణ్ తండ్రి చాలా కాలం క్రితం చనిపోయాడు. దీంతో తల్లి చెలుకమ్మతో లక్ష్మణ్ ఉంటున్నాడు. అతడు కూడా మరణించడంతో అనాధగా మిగిలిన ఆమెకు స్నేహితులు వాట్సాప్ గ్రూపుల ద్వారా సేకరించి సదరు నగదును అందజేశారు.

'భోజనం' నిర్వాహకుల మార్పుపై ఒప్పందం

పాయకరావుపేట రూరల్, జూలై 1 : వెంకటనగరం ఎంపీపీ పాఠశాలలో సోమవారం మధ్యాహ్న భోజన నిర్వాహకుల మార్పుపై డిప్యూటీ డీఈవో పెన్నాడ అప్పారావు సమక్షంలో టీడీపీ, వైసీపీ నాయకుల మధ్య ఒప్పందం జరిగింది. ఈ పాఠశాలలో గత కొన్నేళ్లుగా మధ్యాహ్నం భోజనం నిర్వాహకులుగా పనిచేస్తున్న వారిని తొలగించి వేరొకరికి అప్పజెప్పడానికి టీడీపీ నాయకులు ప్రయత్నించడంతో ఇంతవరకు ఈ విధుల్లో ఉన్నవారు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సోమవారం ఇరు పార్టీలకు చెందిన వారు పాఠశాలకు చేరుకోవడంతో నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం ఇరు పార్టీ నాయకుల మధ్య జరిగిన చర్చల్లో ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి చెందిన వారు పాఠశాలలో మిడ్‌డే మీల్స్ వండడానికి ఒప్పందం చేసుకున్నారు. ఈ విషయం డీఈవో దృష్టికి వెళ్లడంతో డిప్యూటీ డీఈవో అప్పారావు సోమవారం పాఠశాలకు చేరుకున్నారు. ఆయన సమక్షంలో ఇరుపార్టీల వారు ఒప్పంద పత్రాన్ని రాసుకున్నారు. ఎంఈవో-2 రమేష్, పెదరాంభద్రపురం, దేవవరం పాఠశాలల హెచ్‌ఎంలు శ్రీనివాసరావు, నూకరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయిని జ్ఞానేశ్వరి, టీడీపీ నాయకులు వంకా శివకుమార్, వైసీపీ నాయకులు చోడిపల్లి శ్రీనివాసరావు, మల్లే రామకృష్ణ, శ్రీను పాల్గొన్నారు.

'నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి'

అచ్యుతాపురం, జూలై 1 : నియోజకవర్గం అభివృద్ధికి అంతా సహకరించాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అధికారులను కోరారు. సోమవారం అచ్యుతాపురంలో గల పార్టీ కార్యాలయంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు మర్యాద పూర్వకంగా ఆయనను కలిసిన సందర్భంగా మాట్లాడారు. పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

41 మంది రక్తదానం

అనకాపల్లి టౌన్, జూలై 1 : ఇక్కడి రోటరీక్లబ్‌లో సోమవారం రక్తదాన శిబిరం ఏర్పాటైంది. రోటరీ బ్లడ్‌బ్యాంక్ ఆధ్వర్యంలో 43 మంది రక్తదానం చేశారు. విశాఖ రోటరీ బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు దాతల నుంచి రక్తాన్ని సేకరించారు. రోటరీ అసిస్టెంట్ గవర్నర్ మురళీకృష్ణ, అనకాపల్లి అధ్యక్షుడు రాజేష్‌కుమార్, సెక్రటరీ అనిల్, కోశాధికారి సత్యాంద్ర, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఎస్ఐ నరసింగరావుకు పదోన్నతి

అనకాపల్లి టౌన్, జూలై 1 : పట్టణ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న సీహెచ్.నరసింగరావుకు సీఐగా పదోన్నతి లభించింది.

ఘనంగా 'కొప్పిశెట్టి' జన్మదిన వేడుకలు


మంత్రి అనిత సమక్షంలో కేక్ కట్‌చేస్తున్న వెంకటేశ్

నక్కపల్లి, జూలై 1 : టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్ జన్మదిన వేడుకలు నక్కపల్లిలో సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. హోం మంత్రి వంగలపూడి అనిత హాజరై శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమెను వెంకటేశ్ దంపతులు సత్కరించారు. పార్టీ నాయకులు లాలం కాశీనాయుడు, ఏజెర్ల వినోద్‌రాజు, పెదిరెడ్డి చిట్టిబాబు, అమలకంటి అబద్దం, గుర్రం రామకృష్ణ, కొప్పిశెట్టి బుజ్జి, వైబోయిన రమణ, దేవర సత్యనారాయణ, కురందాసు నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సేవ చేయలేమనుకుంటే..

... 5వ పేజీ తరువాయి

రప్పించడం తమకు పెద్ద విషయం కాదని, అయితే తెలుసుకుంటారని చూస్తున్నామన్నారు. ఇప్పటికైనా అధికారులు రాజకీయాలు చేయకుండా ప్రజలకు అందుబాటులో ఉండాలని హెచ్చరించారు. ఒకవేళ పాయకరావుపేట నియోజకవర్గంలో అధికారులు ఎవరైనా ప్రజలకు అందుబాటులో ఉండలేమనుకుంటే వెళ్లిపోవచ్చునన్నారు. ప్రజల కోసం పని చేసే అధికారులను తెచ్చుకుంటామన్నారు. ప్రజల సొమ్ము నుంచి జీతాలు తీసుకుంటున్నారని, ఆ విషయాన్ని గ్రహించాలన్నారు. ఇప్పటికీ పద్ధతి మార్చుకోకపోతే పరిస్థితులు వేరేగా ఉంటాయని మంత్రి అనిత హెచ్చరించారు.

నర్సీపట్నం
నియోజకవర్గం

వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే



ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నీలవేణి, డాక్టర్ సత్యనారాయణను సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

నర్సీపట్నం, జూన్ 1 : వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డేను సోమవారం ఇక్కడ ఘనంగా నిర్వహించారు. ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నీలవేణిదేవి, డాక్టర్ సత్యనారాయణ దంపతులతో పాటు పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు రాజశేఖర్, వంశీకృష్ణ, విజయశాంతి, రేడియాలిస్ట్ డాక్టర్ అల్లు రమ్యలను ఘనంగా సన్మానించారు. వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వరహాలనాయుడు, ఎంఎస్ ప్రసాద్, జాయింట్ సెక్రటరీ కుప్పిలి మురళి, పి.శ్రీనివాసరావు, బాబి , అల్లు అప్పారావు, నర్సింహమూర్తి పాల్గొన్నారు.

అతిసారపై అవగాహన ర్యాలీ



నర్సీపట్నంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఆర్డీవో జయరాం, డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్యోతి

నర్సీపట్నం, జూలై 1 : స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని ఈ నెల నుంచి ఆగస్టు 31 వరకు రెండు నెలల పాటు నిర్వహిస్తున్నామని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జ్యోతి తెలిపారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద అతిసారపై అవగాహన ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. డయేరియా నివారణకు ఐదేళ్లలోపు పిల్లలు ఉన్న ప్రతీ ఇంటికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ టాబ్లెట్లు పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గొలుగొండ, చీడిగుమ్మలలో...

గొలుగొండ : అతిసార వ్యాధిపై గొలుగొండ, చీడిగుమ్మల పీహెచ్‌సీల ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు డాక్టర్ శ్యామ్‌కుమార్, డాక్టర్ ధనుంజయ్‌లు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపట్ల అంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.





ధర్మసాగరం, గొలుగొండలలో సీఎం చిత్రపటాని పాలాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు



మాకవరపాలెంలో...

పండుటాకులు పరమానందం

- పండగ వాతావరణంలో పింఛన్ల పంపిణీ
- అధికారులతో పాటు కూటమి నేతలు హాజరు
- పలు గ్రామాల్లో చంద్రబాబు, పవన్ కల్యాణ్, అయ్యన్నపాత్రుడు చిత్రపటాలకు పాలాభిషేకం



ఏఎల్‌పురంలో మహిళకు పింఛన్ నగదు అందిస్తున్న మాజీ జడ్పీటీసీ తారక వేణుగోపాల్



అయ్యన్నపాలెంలో వృద్ధుడికి పెన్షన్ అందిస్తున్న విజయ్



నాతవరంలో దివ్యాంగునికి పింఛన్ పంపిణీ

నర్సీపట్నం, జూలై 1 : ఇచ్చిన మాట ప్రకారం అవ్వా తాతలకు రూ.ఏడు వేలు పింఛన్ సొమ్ము అందజేయడం చారిత్రాత్మకమని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ అన్నారు. మునిసిపాలిటీలోని 24వ వార్డు అయ్యన్నపాలెంలో సోమవారం ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి హాజరై పలువురు లబ్ధిదారులకు పెన్షన్ డబ్బులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి పెన్షన్ రూ.వెయ్యి పెంచడానికి ఐదేళ్ల పట్టిందని, చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ రూ.మూడు వేల నుంచి రూ. నాలుగు వేలకు ఒకేసారి పెంచారన్నారు. అనంతరం లబ్ధిదారులతో కలిసి చంద్రబాబు చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. కౌన్సిలర్ ధనిమిరెడ్డి మధు, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు. మునిసిపాలిటీలోని పలు ప్రాంతాల్లో పెన్షన్లు అందజేశారు. మునిసిపల్ ఛైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, టీడీపీ వార్డు ఇన్‌చార్జ్, కూటమి నాయకులు పాల్గొన్నారు. ఆర్డీవో జయరాం, మునిసిపల్ కమిషనర్ రవిబాబు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

నర్సీపట్నం అర్బన్ : మండలంలో పింఛన్ల పంపిణీ పండగ వాతావరణంలో సాగింది. ధర్మసాగరంలో సీఎం చంద్రబాబునాయుడు చిత్ర పటానికి పింఛనర్లతో కలిసి జడ్పీటీసీ సభ్యురాలు సుకల రమణమ్మ పాలాభిషేకం చేశారు. అనంతరం సచివాలయ అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లి పింఛన్ల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మాకవరపాలెం : మండలంలోని పలు గ్రామాల్లో పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. మాకవరపాలెంలో తహసీల్దార్ మురళీమోహన్‌రావు, ఎంపీడీవో చంద్రరావు వృద్ధులకు పింఛన్ నగదను అందజేశారు. ఈ సందర్భంగా ఇక్కడ పలువురు టీడీపీ శ్రేణులు, లబ్ధిదారులు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, స్పీకర్ అయ్యన్నపాత్రుడు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అలాగే శెట్టిపాలెం, భీమబోయిన పాలెం, రామన్నపాలెం, రాచపల్లి, జి.కోడూరు. బూరుగుపాలెం, గిడుతూరు, తూటిపాల, తాడపాల, లచ్చన్నపాలెం, తామరం గ్రామాల్లో పాలభిషేకం చేశారు. టీడీపీ నాయకులు అల్లు రామునాయుడు, రుత్తల శేషుకుమార్, రుత్తల జోగిపాత్రుడు, మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు అల్లంపల్లి శిరీషా, కేతిరెడ్డి చిరంజీవి, మళ్ళ జయరాం, వెంకటగిరి,పోతలరాంబాబు పాల్గొన్నారు

గొలుగొండ/కోటవురట్ల : సామాజిక పింఛన్ల పంపిణీ మండల వ్యాప్తంగా సందడిగా సాగింది. గొలుగొండలో టీడీపీ మండల అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, జోగంపేటలో మాజీ సర్పంచ్ సుర్ల బాబ్జి, చీడిగుమ్మలలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు కామిరెడ్డి గోవింద, పాతమల్లంపేటలో సర్పంచ్ మామిడి ఆదిలక్ష్మి, కొత్తఎల్లవరంలో సర్పంచ్ కొల్లి రాంబాబు, రావణాపల్లిలో సర్పంచ్ కొల్లు రామణమ్మ, ఏటిగైరంపేటలో సర్పంచ్ రామకృష్ణ ఆధ్వర్యంలో పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు చిత్రపటానికి లబ్ధిదారులతో కలిసి టీడీపీ శ్రేణులు పాలాభిషేకం చేశారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎంపీడీవో రత్నకుమారి, టీడీపీ నాయకులు సీహెచ్. సాంబమూర్తి, భీమిరెడ్డి సత్యనారాయణ, రామపురెడ్డి జమీలు తదితరులు పాల్గొన్నారు. అలాగే, ఏఎల్‌పురం, కొంగసింగి, చోద్యం, లింగంపేట, తాళ్ళచీడికాడ, పాతకృష్ణాదేవిపేట, నాగాపురం, గింజర్తి తదితర గ్రామాల్లో కూటమి నాయకుల ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. ఈ కార్యక్రమాల్లో గొలుగొండ మాజీ జడ్పీటీసీ సీహెచ్.తారకవేణుగోపాల్, కొంగసింగి, చోద్యం సర్పంచ్‌లు యలమంచిలి నూకరత్నం, అదపురెడ్డి గోపాలకృష్ణ, కూటమినాయకులు బొప్పని ప్రసాద్, కొలగాని రామారావు, మువ్వల బుజ్జి, రమణ, చిన్నాస్వామి, వరహాలబాబు, అదపురెడ్డి ప్రభాకర్, శ్రీకాంత్, రమణ, సహదేవుడు, సత్యనారాయణ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

నాతవరం : మండలంలోని గ్రామ గ్రామాన పింఛన్లను పంపిణీని పండగ వాతావరణంలో నిర్వహించారు. మొత్తం 11,374 మంది లబ్ధిదారులకు రూ. 7.59 కోట్లను అందజేశారు. గుమ్మిడిగొండ తదితర ప్రాంతాల్లో సర్వేర్లు సరిగా పనిచేయకపోవడంతో కొంత ఆలస్యమైంది. సోమవారం పింఛన్లు తీసుకోని వారికి మంగళవారం అందిస్తామని ఎంపీడీవో రాంబాబు తెలిపారు. నాతవరంలో తాండవ ప్రాజెక్టు కమిటీ మాజీ ఛైర్మన్ కొండబాబు, మాజీ ఎంపీపీ ఎస్.విజయ్‌కుమార్, అప్పిరెడ్డి మాణిక్యం, బీజేపీ నాయకులు ఎల్.విక్రమ్, జనసేన నాయకులు రాజాన వీరసూర్య చంద్ర తదితరులు పింఛన్లను పంపిణీ చేశారు.

'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు 27 మంది అర్జీలు

నర్సీపట్నం, జూన్ 1 : ఇక్కడి సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవో జయరాం ఆధ్వర్యంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ సంద ర్భంగా వివిధ ప్రాంతాల నుంచి 27 మంది విచ్చేసి వినతి పత్రాలను సమర్పించారు. ఆర్డీవో అందరితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వీటిపై విచారణ జరిపి పరిష్కారానికి చర్యలు చేపట్టాల్సిందిగా ఆయా విభాగాల అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



బ్యాడ్మింటన్ టోర్నీలో క్రీడాకారుల ప్రతిభ

నర్సీపట్నం, జూలై 1 : జిల్లాస్థాయి బ్యాడ్మింటెన్ టోర్నమెంట్‌లో నర్సీపట్నం క్రీడాకారులు ప్రతిభచూపి పతకాలు సాధించారు. షటిల్ బ్యాడ్మింటెన్ అసోసియేషన్ విశాఖపట్నం ఆధ్వర్యంలో గత నెల 27 నుంచి 30 తేదీ వరకు జీవీఎంసీ స్పోర్ట్స్ ఏరియాలో జరిగిన ఈ టోర్నమెంట్‌లో అండర్ 11 (సింగిల్) విభాగంలో ఎలమంచిలి పృథ్వీ మణికంఠ రన్నర్‌గా నిలిచాడు. అలాగే టి.సాహితి బాలికల సింగిల్ విభాగంలో రన్నర్‌గా, డబుల్‌లో విన్నర్‌గా నిలిచింది. అండర్ 15 విభాగం (డబుల్)లో జి.సంహిత రన్నర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా వీరికి నిర్వాహకులు సర్టిఫికెట్లతో పాటు జ్ఞాపికలను అందజేసి సత్కరించారు.

టిడ్కో ఇళ్లలో ఉండలేం..

... 5వ పేజీ తరువాయి

టిడ్కో గృహ సముదాయాల బాధ్యత తీసుకోలేదు. దీంతో సమస్యను ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాక ఇబ్బందులు పడుతున్నామని లబ్ధిదా రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందుకే పూర్తి స్థాయిలో లబ్ధిదారులు ఇళ్లల్లోకి దిగలేదు. కానీ బ్యాంకుకు మాత్రం రుణం కింద నెల నెలా రూ.3,500 నుంచి రూ.4,000 వరకు చెల్లించాల్సి వస్తోందని వారు గగ్గోలు పెడుతున్నారు. కూటమి ప్రభుత్వం రావడంతో తమ కష్టాలు తీర తాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అంతటా పింఛన్ పండగ

... 5వ పేజీ తరువాయి

అధికారంలోకి వచ్చిన వెంటనే గత వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన రూ.3 వేలు పింఛన్‌ను రూ.4 వేలుకు, దివ్యాంగులకు రూ.6 వేలు పెంచుతూ సీఎం చంద్రబాబునాయుడు నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. పెంచిన మొత్తాన్ని ఏప్రిల్ నుంచి వర్తింపజేస్తామని హామీ ఇచ్చారు. సోమవారం ఉదయం 6 గంటల నుంచి జిల్లాలో 522 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాలు మొదలు పెట్టి, తొలిరోజే సాయంత్రం 5 గంటల సమయానికి 83.52 శాతం పంపిణీ పూర్తయింది.

తొలిరోజు 83.52 శాతం పంపిణీ పూర్తి

జిల్లా వ్యాప్తంగా 2,64,033 మంది లబ్ధిదారులు ఉండగా తొలిరోజైన సోమవారం సాయంత్రం 5 గంటల సమయానికి 2,20,533 మందికి (83.52 శాతం) పింఛన్లు పంపిణీ చేశారు. మిగిలిన వారందరికీ రెండో రోజు అందజేయనున్నారు. కె.కోటపాడు మండలంలో అత్యధికంగా 93.99 శాతం మందికి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ మండలంలో 11,002 మంది లబ్ధిదారులుండగా, అందులో 10,321 మందికి తొలిరోజు పింఛన్ల పంపిణీ పూర్తి చేశారు. అనకాపల్లి అర్బన్‌లో 92.36 శాతం, సబ్బవరంలో 90.16 శాతం పింఛన్లు అందజేశారు. చివరి స్థానంలో ఎస్.రాయవరం మండలంలో 71.79 శాతం, రావికమతం 75.26 శాతం, నక్కపల్లి 76.11 శాతం ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా తొలిరోజు అన్ని మండలాల్లో 83.52 శాతానికి పైబడి పింఛన్ల పంపిణీ పూర్తయిందని డీఆర్‌డీఏ అధికారులు తెలిపారు.

మందుల ఖర్చు కోసం వెతుక్కోవలసిన పని లేదు



నాకు కిడ్నీ ఆపరేషన్ అయిన తరువాత గత ప్రభుత్వం ఐదు వేల రూపాయలు పింఛన్ ఇచ్చేది. నాకు మందుల ఖర్చు రూ.9 వేల వరకు కావడంతో అదనంగా నాలుగు వేల రూపాయల కోసం వెతుక్కునే పరిస్థితి ఉండేది. కూటమి ప్రభుత్వం రూ.10 వేలు పింఛన్ అందించడం చాలా ఆనందంగా ఉంది. మందులతో పాటు చార్జీలకు కూడా వెతుక్కోవలసిన అవసరం లేదు. - మామిడి నాగరాజు, మాడుగుల

చోడవరం
నియోజకవర్గం

4న విద్యా సంస్థల బంద్

చోడవరం, జూలై 1: వైద్య విద్యకు సంబంధించి నీట్ పరీక్షల పేపర్ లీక్‌పై కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా ఈనెల 4న చేపట్టనున్న రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ విజయవంతం చేయాలని పీడీఎస్‌వో విద్యార్థి సంఘం జిల్లా కో కన్వీనర్ ఏ. మౌనిక పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వద్ద నీట్ పరీక్ష రద్దు కోరుతూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రధాని మోదీ ప్రభుత్వం పరీక్షల నిర్వహణలో ఘోరంగా విఫలమైందన్నారు.ఈస్థితిలో చేపడుతున్న విద్యాసంస్థల బంద్‌కు విద్యార్థులంతా మద్దతు పలకాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి. రా జేష్, ధనలక్ష్మి పాల్గొన్నారు.

మెరుగైన బోధనకు శిక్షణ దోహదం

- సమగ్రశిక్ష అధికారి మురళీమోహన్



మాట్లాడుతున్న మురళీమోహన్

చోడవరం, జూలై 1: ఉపాధ్యాయులు మెరుగైన రీతిలో చిన్నారులకు బోధన అందించేందుకు టీచ్‌టు టూల్ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు జిల్లా సమగ్రశిక్ష అకడమిక్ మోనిటరింగ్ అధికారి మురళీ మోహన్ తెలిపారు. స్థానిక బాలికల హైస్కూల్‌లో చోడవరం, మాడుగుల, పెందుర్తి నియోజకవర్గాలకు చెందిన ఉపాధ్యాయులకు ఈ శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వృత్తిపరంగా ఉపాధ్యాయులకు టీచ్‌టు టూల్ వల్ల బోధన సులభతరం కావడంతో పాటు, విద్యార్థులకు మరింత తేలికగా పాఠాలు అర్థమయ్యేలా చూడవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐవీ రామిరెడ్డి, ఎంఈవోలు జయలక్ష్మి, సింహాచలంలతో పాటు, మాస్టర్ ట్రైనీలుగా జగన్నాథరావు, భా స్కర్, సముద్రం, బొంజుబాబు, కుమార్, సతీష్ పాల్గొన్నారు. ఈ శిక్షణ తొమ్మిదిరోజుల పాటు ఉంటుందని ఎంఈవో జయలక్ష్మి తెలిపారు.

దిబ్బిడి డీఏపై ఫిర్యాదు



ఎంపీడీఓకి ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

బుచ్చెయ్యపేట, జూలై 1: పింఛన్ పంపిణీలో నిబంధనలు పాటించని దిబ్బిడి గ్రామ సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ శంకుతలపై టీడీపీ నాయకులు సోమవారం ఎంపీడీఓ వెంకటాచార్యులకు ఫిర్యాదు చేశారు. మండల వ్యాప్తంగా కూటమి నాయకుల సమక్షంలో పింఛన్ల పంపిణీ జరుగుతుండగా, దిబ్బిడిలో శంకుతల తమకు సమాచారం కూడా ఇవ్వలేదని స్థానిక ఎంపీటీసీ మాజీ సభ్యుడు గొన్నాబత్తుల శ్రీనివాసరావు, శానాపతి శ్రీనివాసరావు, శానాపతి మణికంఠ,చిన్ని అప్పారావు, ఎం.సంతోష్ కుమార్, డి.కృష్ణ తదితరులు ఫిర్యాదులో ఆరోపించారు. దీనిపై దర్యాప్తు చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.



గొట్లంలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే బండారు



ఇంటికి వెళ్లి పింఛను అందిస్తున్న చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

పింఛన్ల పండగ.. ఆనందం నిండుగా..

- గ్రామాల్లో పింఛన్ల పంపిణీ
- ఉత్సాహంగా పాల్గొన్న టీడీపీ జనసేనశ్రేణులు

చోడవరం, జూలై 1: పింఛన్ల పంపిణీతో సోమవారం అన్ని గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా గ్రామాల్లో టీడీపీ, జనసేన నాయకులు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకాలు నిర్వహించారు. పింఛన్ల పంపిణీలో, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు, ఆశ, అంగన్వాడీలు తదితరులు పాల్గొన్నారు. పట్టణ పరిధి పింఛన్ల పంపిణీలో తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లునాయుడు, పెదబాబు, పట్టణ పార్టీ అధ్యక్షుడు దేవరపల్లి వెంకట అప్పారావు, జనసేన నాయకులు గూనూరు మూలినాయుడు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని బెన్నవోలులో మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ మజ్జి గౌరీశంకర్,రాయపురాజుపేటలో మం డల పార్టీ అధ్యక్షుడు బొడ్డేడ గంగాధర్, సర్పంచ్ రామునాయుడు తదితరులు పాల్గొన్నారు. వెంకన్నపాలెంలో సర్పంచ్ మొల్లి ఈశ్వరరావు, జనసేన నాయకులు జగదీశ్ తదితరులు పాల్గొన్నారు. లక్కవరంలో సేనాపతి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ కర్రి కోటేశ్వరరావు పింఛన్లు అందచేశారు. ఎడ్లవీధిలో టీడీపీ నేత గొర్లె సుధాకర్, ఈర్లె శ్రీనివాస్ పాల్గొన్నారు.

తొలిరోజే 84శాతం పింఛన్లు పంపిణీ

మండలంలో పింఛన్ల పంపిణీ తొలిరోజే 84శాతం మంది లబ్ధిదారులకు పింఛను పంపిణీ పూర్తిచేశారు. మండలంలోని 13,311 పింఛన్లకు గాను, 11,266 మందికి పింఛన్లుఇచ్చారు.

మాది చేతల ప్రభుత్వం: ఎమ్మెల్యే కే ఎస్ ఎన్ ఎస్ రాజు

చోడవరం: చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీ మేరకు పింఛన్ల మొత్తం పెంచి చేతల ప్రభుత్వమని నిరూపించుకుందని స్థానిక ఎమ్మెల్యే కే ఎస్ ఎన్ ఎస్ రాజు అన్నారు. సోమవారం పట్టణ శివారు రేవళ్ల గ్రామంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆ యన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లునాయుడు, మాజీ ఎంపీపీ పెదబాబు, జనసేన నాయకులు సిరిపురపు రమేష్, టీడీపీ నాయకులు సేనాపతి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట: వడ్డాది ఎస్సీ కాలనీలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కూటమి నేతలు గేదెల సత్యనారాయణ, గోకివాడ కోటేశ్వరరావు, శిరిగిరిశెట్టి శ్రీరామూర్తి, దొండా నరేష్, వియ్యపు అప్పారావు, డొంకిన అప్పలనాయుడు, ఎంవివి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. కోమళ్లపూడి, కొండెంపూడి, పొట్టిదొరపాలెం, ఎల్.సింగవరం, లోపూడి, ఎల్‌బీపీ.అగ్రహారం, విజయరామరాజుపేట, మంగళాపురం గ్రామాల్లో ఎమ్మెల్యే రాజు పింఛన్లు అందజేశారు.

కె.కోటపాడు: మండలం గొట్లం గ్రామంలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సోమవారం సీఎం చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేసి అనంతరం పింఛన్లను ఇంటింటికి వెళ్లి అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం సీఎం చంద్రబాబు పింఛన్ల సొమ్ము పెంచారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పట్నాయక్, తహశీల్దార్ కె. ఈశ్వరమ్మ, ఎస్ఐ లక్ష్మీనారాయణ, గొట్లం మాజీ సర్పంచ్ కంచపాటి వెంకటరావు, నాయకులు కొట్యాడ నారాయణమూర్తి, మాజీ ఎంపీపీ సబ్బవరపు రామునాయుడు, జూరెడ్డి రాము, పూడి నారాయణరావు, పూడి శ్రీను, కశిరెడ్డి అప్పలనాయుడు, పైలా నారాయణమూర్తి తదితర నాయకులు పాల్గొన్నారు.

రావికమతం: ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబు పింఛన్ల పెంచి లబ్ధిదారుల్లో ఆనందం నింపారని ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు అన్నారు. మండలంలో కొత్తకోట, దొండపూడి, టి.అర్జాపురం, రావికమతంలలో పింఛన్ల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రాజాన కొండనాయుడు, తెలుగు మహిళ అధ్యక్షురాలు కోట నీలవేణి గోవిందరావు, ఉగ్గిన శ్రీను, వెదురుపర్తి వెంకటచారి, అర్జాపురం సర్పంచ్ మడగల ఫాల్గుణ, రావికమతం సర్పంచ్, ఉప సర్పంచ్‌లు గంజి మంగ మోదునాయుడు, ఎంపీటీసీ వేపాడ లక్ష్మీనాగేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు. చినపాచిల, గుమ్మాళ్ళపాడు, తట్టబంద, గొంప గ్రామాలలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. సర్పంచ్, ఎంపిటీసీలు కోమటి రామలక్ష్మి శంకరావు, ఎం.గంగాభవానీ, నాయకులు కాళింగ తాతలు, గోకివాడ రమణ పాల్గొన్నారు.

మాడుగుల: మాడుగులలో సచివాలయ ఉద్యోగులు పెన్షన్ల పంపిణీ చేశారు. ఆయా వార్డులో పాటు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాడుగుల మండలంలో 92.23 శాతం పంపిణీ

మాడుగుల రూరల్: మండలంలో 11918మంది పింఛన్‌దారులు ఉండగా తొలిరోజే 10995 మందికి పింఛన్లు అందజేసి 92.23 శాతం నమోదు చేశారు. ఈ సందర్భంగా గ్రామాల్లో కూటమి నేతలు సంబరాలు జరుపుకున్నారు. సీఎం చంద్రబాబు, డిప్యుటీ సీఎం పవన్ కల్యాణ్‌లతో పాటుపలువురు నాయకులు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కేజేపురంలో ఎంపీటీసీ సభ్యులు భీశెట్టి శ్రీనివాసు, స్థానిక నాయకులు జోగినాయుడు, ఆదిబాబు, రాము, నాగేశ్వరరావు, నాగమణి తదితరులు ఆధ్వర్యంలో పాలాభిషేకం చేపట్టారు. ఎం.కె.వల్లాపురంలో మజ్జి తాతబాబు, భీమునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

చీడికాడ: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో ఉమ్మడికూటమి ముఖ్యమంత్రి చంద్రబా బునాయుడుకే దక్కుతుందని రాష్ట్ర మాజీ మంత్రి రెడ్డి సత్యనారాయణ అన్నారు. పెదగోగాడలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. టీడీపీ మం డల అధ్యక్షులు పోతల చిన్నంనాయుడు, గండి ముసలి నాయుడు ఆధ్వర్యంలో, చీడిపల్లిలో, దిబ్బపాలెంలో గౌరీపట్టపు నానాజీ, దారపు పెద్దినాయుడుల ఆధ్వర్యంలో చం ద్రబాబు చి త్రపటాలకు పాలాభిషేకాలు చేసి పింఛన్‌లు అధికారులతో కలిసి అందించారు. మధ్యాహ్నం వరకూ నెట్ సక్రమంగా పనిచేయక పింఛన్ పంపిణీమందకొడిగా సాగింది. ఎంపీడీవో ఉమామహేశ్వరి, ఈవోపీఆర్డీ కామే శ్వరరావు, ఏవో ఎల్.కామేశ్వరరావు మంచాల, కోనాం, శిరిజాం గ్రామాల్లో పింఛన్ల పంపిణీ తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చలుగు ఈశ్వరమ్మ, టీడీపీ నాయకులు రెడ్డి రాము, రెడ్డి జయమ్మ, ఎల్.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి: మండల కేంద్రంలో అంబేడ్కర్ కాలనీ, రెల్లిపేటలో మాజీఎంపీపీ కిలపర్తి రాజేశ్వరీ, టీడీపీ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. మండల ప్రత్యేక అధికారి రవీంద్రనాథ్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ అప్పలరాజు, సర్పంచ్ పెంటమ్మ, అర్జునరావు, అల్లు అబద్దం, మురళి, చల్లా నానాజీ,బందం అప్పలరాజు, తది తరులు పాల్గొన్నారు. మాజీ ఉపముఖ్యమంత్రి బూడిముత్యాలనాయుడు స్వగ్రామం తారువలో టీడీపీ కార్యకర్తలు రెడ్డి గోవింద, సురేష, అల్లు.శ్రీను పింఛన్లు అందజేశారు. అధ్యక్షుడు, సూర్యనారాయణ, సర్పంచ్ వరలక్ష్మి, ఎం.అలమండలో పాత్రునాయుడు, కొత్తపెంటలో గోవింద, బర్ల నాయుడు, రైవాడలో అప్పారావు, రమణ పిం ఛన్లు అందించారు.

మాడుగుల : మాడుగుల మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు, టీడీపీ, జనసేన టౌన్‌పార్టీ అధ్యక్షుడు వద్దాది రంజిత్‌వర్మ, ఇళ్లపు రమేష్ స్థానిక బస్టాండ్ ఆవరణంలో జరిగిన చం ద్రబాబు, పవన్ కల్యాణ్, మోదీ చిత్రపటానికి పాలభిషేకం చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు అద్దెపల్లి జగ్గారావు, బీజేపీనేత సంతోషి సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

రోలుగుంట: ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.రాజు జేపీ అగ్రహారం, కుసర్లపూడి, కొమరవోలు, కొండపాలెం, రోలుగుంట, నిండుగొండ, పడాలపాలెం, జానకిరాంపురంల్లో పింఛన్ల పంపిణీ చేశారు. నాయకులు రొంగలి రమణ, గండి సింహాద్రి, సబ్బవరపు పెద్దినాయుడు, పోతల శ్రీనివాసరావు, బంటు చిరంజీవి, బోడాపాత్రుని నరేష్, సుర్ల రామకృష్ణ, ఈశ్వరరావు, బంటు రాజుపాల్గొన్నారు.



వడ్డాదిలో పింఛన్ పంపిణీ చేస్తున్న తాతయ్యబాబు



పింఛన్లు పంపిణీలో మాజీ ఎంపీపీ రాజేశ్వరీ, నేతలు



మాడుగులలో ఎన్టీఆర్ వి గ్రహం ఎదుట పింఛన్ల పంపిణీ

మాడుగుల
నియోజకవర్గం

చెట్లకింద చదువులకు స్వస్తి

- ప్రైవేట్ భవనంలోకి చెరకుపల్లిలోని పాఠశాల తరలింపు
- ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



భవనంలో తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

చీడికాడ, జూలై 1: మండలంలోని కోనాం శివారు చెరకుపల్లి గిరిజన గ్రామంలో ప్రభుత్వ పాఠశాలను ఎంఈవో బొంజుబాబు చొరవతో సోమవారం ప్రైవేట్ భవనంలోకి మార్చారు. జూన్ 28న 'గిరిజన గ్రామంలో ఎన్నాళ్లీ ఈ చెట్లకింద చదువులు' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో అదేరోజు ఎంఈవో కె.బొంజుబాబు ఈ పాఠశాలను పరిశీలించారు. ఈ వరుస కథనాలకు స్పందించిన డీఈవో ఈ పాఠశాలను కొత్తభ వనం పూర్తయ్యేవరకూ వేరే భవనంలో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈనేపథ్యంలో ఎంఈవో సోమవారంప్రైవేట్ భవనంలో పాఠశాలను ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం బీవీ.మూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ప్రభుత్వ భవనం పూర్తికి నిధులు మంజూరు చేయాలని గ్రామ పెద్దలు ఎంఈవోని కోరారు.

ఘనంగా దుర్గమాంబ ఆలయ వార్షికోత్సవం

దేవరాపల్లి, జూలై 1: మండలంలోని ములకలాపల్లిలో దుర్గమాంబ గ్రామ దేవత ఆలయ ఏడవ వార్షికోత్సవం సందర్భంగాసోమవారం సాయి విశ్వనాథ్ ప్రత్యేక పూజ లు చేయించారు.అనంతరం అన్న సమారాధన నిర్వహించారు.

పాల సొసైటీ కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం

చీడికాడ, జూలై 1: మండలంలో మం చాల పాలకేంద్రం నూ తన అధ్యక్షు నిగా కసి రెడ్డి రామకృష్ణను డైరె క్టర్లు ఏకగ్రీవంగా ఎ న్నుకున్నారు. అయితే సొసైటీలో ఇంతవరకూ డైరెక్టర్‌లుగాపనిచే సిన కసిరెడ్డి శ్రీరా మ్మూర్తి, బొడ్డు మోదమ్మలు పదవీ కాలం పూర్తికావడంతో సోమవారం సంఘం మాజీ అధ్యక్షుడు కసిరెడ్డి శ్రీరామ్మూర్తి అధ్యక్షతన పాడిరైతులతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముందుగా కసిరెడ్డి రామకృష్ణ, కసిరెడ్డి వరలక్ష్మిలను డై రెక్టర్లుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అతిసారంపై అవగాహన ర్యాలీ

రావికమతం, జూన్ 1: మండల కేంద్రంలో వైద్య సిబ్బంది సోమవారం అతిసారపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పరిసరాలలో చెత్తచెదారం లేకుండా చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు.

ప్రజలకు సేవచేయలేమనుకుంటే ...

... 5వ పేజీ తరువాయి

రప్పించడం తమకు పెద్ద విషయం కాదని, అయితే తెలుసుకుంటారని చూస్తున్నామన్నారు. ఇప్పటికైనా అధికారులు రాజకీయాలు చేయకుండా ప్రజలకు అందుబాటులో ఉండాలని హెచ్చరించారు. ఒకవేళ పాయకరావుపేట నియోజకవర్గంలో అధికారులు ఎవరైనా ప్రజలకు అందుబాటులో ఉండలేమనుకుంటే వెళ్లిపోవచ్చునన్నారు. ప్రజల కోసం పనిచేసే అధికారులను తెచ్చుకుంటామన్నారు. ప్రజల సొమ్ము నుంచి జీతాలు తీసుకుంటున్నారని, ఆ విషయాన్ని గ్రహించాలన్నారు. ఇప్పటికీ పద్ధతి మార్చుకోకపోతే పరిస్థితులు వేరేగా ఉంటాయని మంత్రి అనిత హెచ్చరించారు.